ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
మార్చి 01, 2015

నాన్నే నా హీరో
- పి.వి. సింధు



‘దిల్ వాలే...’ నడుస్తూనే వుంది

ఒక సినిమా ఇరవయ్యేళ్లపాటు ఒకే థియేటర్లో నడవడమంటే చిన్న విషయమా! ఆడిస్తున్న సినిమా హాలు యాజమాన్యం, చూస్తున్న ప్రేక్షకులను ఇద్దరినీ మెచ్చుకోవాల్సిందే. ఆ చిత్రం ‘దిల్ వాలే దుల్హనియా లేజాయేంగే’ కాగా...ఆ థియేటర్ ‘మరాఠా మందిర్’. ఆదిత్య చోప్రా దర్శకత్వంలో వెలువడిన తొలి చిత్రమది. 1995లో విడుదలైంది. అయితే ఈ మధ్య ‘మరాఠా మందిర్’ ఆ చిత్ర ప్రదర్శనను ఆపివేయనుందన్న వార్తలు వెలువడ్డాయి. ఆ వెంటనే థియేటర్ యాజమాన్యానికి, సినిమా దర్శక నిర్మాతలకు మధ్య జరిగిన చర్చలు ఫలవంతం కావడంతో చిత్ర ప్రదర్శనను కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. కాకపోతే రోజుకు నాలుగు ఆటలు కాకుండా ఉదయపు ఆటను మాత్రమే కొనసాగిస్తారు. అంటే ఇతర చిత్రాలతోపాటుగా స్థానికులు మెచ్చిన ‘దిల్‌వాలే దుల్హనియా...’ కూడా ప్రదర్శితమౌతూనే వుంటుంది. సో... షారూక్ (రాజ్), కాజోల్ (సిమ్రాన్) అభిమానులు సంతోషంగా సినిమా చూసేయొచ్చు. ●

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

సెలవు సందడి!

చిన్నతనంలో...సెలవులు...అంటే చాలు! చెప్పలేనంత ఆనందం. పట్టలేనంత సంతోషం. స్వేచ్ఛగా విహరించడానికి కావాల్సిన రెక్కలు వచ్చేసినంత తన్మయత్వం చుట్టు ముట్టేసేవి. ఆ తర్వాత చెప్పేదేముంది! పుస్తకాలకు, పాఠాలకే కాదు. పనిష్మెంట్లకూ సెలవే. నేస్తాలతో కలిసి పొలాల గట్లెంట పైరు గాలిలా పరుగు తీయాలని, చెరువుల్లో చేపల్లా ఈదులాడాలని, వానరాల్లా చెట్లెక్కాలని, మామిడికాయలు...జామకాయలు...చీమ చింతకాయలు కోసుకు తినాలని...ఏవేవో ఆశలు. కోరికలు కమ్మేసేవి. అందుకే ఎప్పుడెప్పుడు సెలవులొస్తాయా అని ఒళ్లంతా కళ్లు చేసుకొని ఎదురుచూస్తుంటారు చిన్నారులు.

సంక్రాంతి సెలవులు, దసరా సెలవులు, క్రిస్టమస్ సెలవులు, వానాకాలం సెలవులు, కోతల కాలపు సెలవులు, వేసవి సెలవులు ...అన్నిటికోసమూ ఎదురు చూపే. సెలవులకు నాలుగు రోజుల ముందు నుంచే ఉత్సాహం ఉరకలు వేస్తుంది. హుషారు జోరందుకుంటుంది. ఇక సెలవుల్లో సంగతి చెప్పేదేముంది! తిండీ తిప్పలు మర్చిపోయి... ఒక్క క్షణం వృధా చేయకుండా ఆటపాటలతో గడిపేయడమే. సెలవులు మరి రెండు రోజుల్లో అయిపోతాయనగానే నీరసం ఆవహించేస్తుంది. అప్పడే అయిపోయాయా? మరి నాలుగు రోజులు ఇస్తే ఎంత బావుండేది? అన్న సణుగుళ్లు బయల్దేరతాయి.

ఇలా సెలవుల కోసం పరితపించేది పిల్లకాయలేనా! యువరాజులూనూ! ఒకానొక కురువృద్ధ పార్టీలో వున్న ఒక్కగానొక్క యువరాజుగారు కూడా అంతే! ఆయనగారు కుర్రోడో, చిన్నోడో, పిల్లోడో అంతుబట్టడం లేదు కానీ వారికి కూడా సెలవులంటే మహా ఇష్టంలా వుంది. దేశం మొత్తం పార్లమెంటులో జరగనున్న బడ్జెట్ వివరాలకోసం ఉత్కంఠగా ఎదురు చూస్తుంటే... యువరాజా వారు 'సెలవు' పెట్టేసి ఎంచక్కా చెక్కేశారు (ఎక్కడికని మాత్రం అడక్కూడదు). ప్రతిపక్షంలో నిలబడి ప్రభుత్వాన్ని గడగడలాడించాల్సిన సమయంలో... సభలో ప్రవేశపెట్టనున్న బిల్లుల్లో వున్న చిల్లులపై నిప్పులు కక్కాల్సిన వేళలో... ఇలా పలాయనం చిత్తగించాడేంట్రా అని పార్టీ నేతలు తల పట్టుకోవాల్సి వచ్చింది. వివరణలు ఇచ్చుకోవాల్సి వచ్చింది. పార్లమెంటుకొచ్చినా పాఠశాల పిల్లోడి బుద్ధి పోలేదంటూ అధికారపక్ష నేతలు పేల్చే జోకులకు తల దించుకోవాల్సి వచ్చింది. ఎన్నికల్లో కష్టపడిపోయిన నేతలు విదేశాలెళ్లి విశ్రాంతి తీసుకోవడం చూస్తుంటాం. అలాంటిది యువరాజా వారేంటి అటూ ఇటూ కాకుండా సెలవు పుచ్చుకున్నాడన్న అనుమానం పుట్టేసింది.

కానీ ఇవ్వాల్సిన వాళ్లు సెలవులిచ్చారు. పుచ్చుకోవాల్సిన వాళ్లు పుచ్చుకున్నారు. మధ్యలో వాళ్లకెందుకట ఉడుకు! సాధారణ ఎన్నికల్లోను, ఢిల్లీ ఎన్నికల్లోనూ ఓడించేసిన ప్రజలే యువరాజా వారికి సెలవులిచ్చేశారు గందా! ఇంక నో ప్రశ్నలు, జోకులు!! ■

◆ మనలో మాట

టపా

చిత్రాలకు వేదిక

ఫిబ్రవరి 15, ఆదివారం స్నేహలో ప్రచురితమైన కథనాలన్నీ బాగున్నాయి. యూట్యూబ్ యూత్ అట్టమీది కథ ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నాం. నిజంగా యూట్యూబ్ దృశ్య భాండాగారమే. దాని ద్వారా విజ్ఞానాన్ని ఆర్జించవచ్చు. ప్రపంచాన్ని చూడొచ్చు. మరో వైపు అశ్లీల, అసభ్య చిత్రాలకు వేదిక కూడా. ప్రేమ పేరుతో వంచించి అమ్మాయిలపై అఘాయిత్యాలకు పాల్పడి ఆ దృశ్యాలు చిత్రించి యూట్యూబ్‌లో పెడతామని బెదిరిస్తున్న ఆకతాయిల ఆగడాలు పెచ్చుమీరాయి. నిఘా అవసరం.

టి. శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖపట్నం

అబ్బురపరిచాయి

రంగుల పేజీలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా బొట్టుబిళ్లలతో మదర్ థెరిస్సా బొమ్మ తయారుచేయడం, బ్యాలన్స్ బ్యూటి కుక్క చేసే విన్యాసాలు అబ్బురపరిచాయి. "మట్టిబొమ్మల" బామ్మ కథనం స్ఫూర్తి దాయకంగా అనిపించింది. ఇంటర్ చదువుతున్న అమ్మాయిలు కరెంటుతో పనిలేని నీటి మోటార్ కనిపెట్టడం వారి సృజనాత్మకతకు నిదర్శనం. పిల్లల్ని చదువు పేరుతో పుస్తకాలకే పరిమితం చేయకుండా, వారిలోని సృజనాత్మకతను వెలికితీసే ఇలాంటి ప్రయోగాలు చేసే విధంగా ప్రోత్సహించడం మంచిది. "హథీరామ్" కథ బాగుంది. మనుషులనే కాదు ప్రకృతిలోని ప్రతి జీవినీ ప్రేమించాలన్నది ఈ కథలో దాగున్న విషయం. ముఖ్యంగా కోతుల్ని చూసి నవ్వుకుంటామే కానీ వాటి సంరక్షణ గురించి ఎవరూ పట్టించుకోరు. మంచి కథా వస్తువును తీసుకున్న రచయిత్రికి అభినందనలు.

దోనేపూడి సునీల్, విజయవాడ

ఈ మెయిల్ ద్వారా వారిని ప్రోత్సహించాలి

ఫిబ్రవరి 15 సంచికలో యువలో ప్రచురితమైన "కండల వెనుక కష్టాలు" అనిల్ కుమార్ చెప్పిన సంగతులు చదువుతుంటే ఆసక్తిగా అనిపించాయి. క్రీడలంటే క్రికెట్ వంటివి మాత్రమే కాదు బాడీబిల్డింగ్ కూడా అని చెప్పడం బాగుంది. వారు కేవలం శరీరాన్ని సౌష్టవంగా మలుచుకోవడమే కాదు...ట్రైనింగ్ ఇస్తారు అనే విషయం తెలిసింది. ప్రభుత్వం ఇలాంటి వారిని ప్రోత్సహించాలి. "చూద్దామా"లో సిరుల చికాగో బాగుంది. అక్కడ ప్రకృతి అందాలు, ఎత్తైన భవనాలు, వివేకానంద స్ట్రీట్ వంటివాటి గురించి వ్యాసకర్త చక్కగా వివరించారు. మనుషుల చిత్రాలతో ఉన్న వాటర్ ఫౌంటేన్‌లు అవన్నీ అబ్బురపరిచే దృశ్యాలే. ప్రేమ విప్లవం సీరియల్ ప్రతి వారం చదువుతున్నాము. దాన్ని పుస్తక రూపంలో తీసుకొస్తే బాగుంటుంది.

షేక్ పుల్లాసాహెబ్,
సత్తెనపల్లి, గుంటూరు జిల్లా

నోరూరించింది

రుచిలో "ఓహో...జిలేబీ" నోరూరించింది. "కవిత్వమ్" తప్పిపోయిన పసివాళ్ల బాధను తెలిపే కవిత "పాపం పసివాళ్లు" చదువుతుంటే బాధ కలగక మానదు. పురుష స్వామ్యంలో మహిళల ఇక్కట్లు గురించి అడిగోపుల గారు రాసిన కవిత "కన్నీళ్లు చప్పుడు చేయవు" కవిత సైతం ఆలోచింప చేసే విధంగా ఉంది. స్త్రీలపై జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించేదిగా ఉంది. "మనలో మాట" చలాకీ చీపురు వాస్తవికానికి వ్యంగ్యం జోడించారు. ఆసక్తిగా ఉంది. "ప్రత్యేకం" శీర్షికలో సూది మొనంత గ్రంథం, అరటన్ను బరువు గల పుస్తకం, టేప్ రికార్డు నవలలు గురించి చెప్పిన విషయాలు ఆకట్టుకున్నాయి.

బి. స్వాతి, కడప

ఈ సంచికలో....

వేసవి చల్లచల్లగా

కవర్‌స్టోరీ 14

ఇంకా వసంత రుతువు ప్రకృతి వాకిట అడుగిడనేలేదు ...అప్పుడే గ్రీష్మం వెచ్చటి ఆవిర్లను వెళ్లగక్కుతోంది. ఇక వేసవి మొదలైతే ఉదయభానుడి ఉగ్రరూపం ఇంకెంత భయంకరంగా ఉంటుందోనని ఈ పాటికే చాలా మంది గుండెల్లో బెంగకూడా మొదలై ఉంటుంది. వడగాల్పులు, వెచ్చటి ఆవిర్లు, రోజు రోజుకి పైకి ఎగబాకే ఉష్ణోగ్రతలు.... ఉక్కపోత, దానికి తగ్గట్టు కరెంటు కోతలు...అన్నీ వెరసి ఎండాకాలం... కాదు, మనపాలిట గడ్డుకాలం గడిచేదెలానో అనే చింత తలపకామానదు.మరేం ఫర్వాలేదు ఈ వేసవిని చల్ల చల్లగా గడిపేందుకు ఏదైనా విహారయాత్రకు వెళితే...అబ్బ ఇక ఎండ బాధల నుండి ఉపశమనం లభించినట్టే...

కళ 3
మ్యాజిక్ మందు

యువ 4
అందుకే లొంగిపోయాడు

వింతలోకం 5
ఆమె కత్తిని మింగేస్తుంది

కథ 6
అమ్మకో మాట

నవ్వుల్ - పువ్వుల్ 8

సినిమా కబుర్లు 9
నాట్యలోచన రాజసులోచన

ప్రత్యేకం 10
నాన్నే నా హీరో

సీరియల్ 18
ప్రేమ విప్లవం

రుచి 21
రకరకాల వడియాలు

బాలనేస్తాలు 22
రంగులేద్దాం

కొత్త పుస్తకాలు 24
సామాజిక శతకాలు

కాలేజీ కోసం ఇల్లు అమ్మేశాడు 13



జీవితం -12



మ్యాజిక్ మందు

పిల్లలకతను పింటూ. మ్యాజిక్కులు మొదలెట్టాడూ అంటే ఆ చిన్నారులు ఆశ్చర్యంతో నోరు తెరవాల్సిందే. విదూషకుడి గెటప్‌లో వెంట్రిలాక్విజమ్ చేశాడంటే కిందపడి దొర్లుతూ నవ్వాల్సిందే. అతనే ప్రవీణ్ తుల్పులే. ఇదే అతని అసలు పేరు. భారత మాజీ నౌకాదళాధికారి. ప్రస్తుతం తన పూర్తి సమయాన్ని మ్యాజిక్కులు చేయడానికే కేటాయిస్తున్నారు. అదీ ఆసుపత్రులు, అనాథాశ్రమాల్లో జబ్బు పడిన పిల్లలను నవ్వించడానికి... ఆ కాసేపైనా బాధను మరిపించడానికి..! అంతా ఉచితంగానే! ముంబై! దేశ ఆర్థిక రాజధాని! అంత పెద్ద సిటీలో ఒకానొక సాదా సీదా వ్యక్తి పింటూ. అక్కడి ఆసుపత్రులు, అనాథాశ్రమాల్లో చిన్నారులకతను సుపరిచితుడు. మరీ ముఖ్యంగా పిల్లల వార్డుల్లో వుండే వారికి. ఇంకా చెప్పాలంటే క్యాన్సర్ వంటి మహమ్మారుల బారిన పడి రోజు రోజుకు ఆయుషు తరిగిపోతున్న చిన్నారులకు. క్రమం తప్పకుండా అక్కడికెళ్ళి తన ప్రదర్శనలతో వారిని నవ్విస్తాడు. కేకులు కోయించడం, బొమ్మలు పంచడం, బూరలతో వింత ఆకృతులను తయారుచేయడం... ఏది చేసినా చిన్నారుల మోములో చిరునవ్వు కోసమే. ఒక్కమాటలో చెప్పాలంటే ఇతను విదూషక మెజీషియన్. మ్యాజిక్కులూ చేస్తాడు. విదూషకుడిలానూ నవ్విస్తాడు. అందుకే రెండూ కలిపి ఇతన్నలా పిలుస్తుంటారు. ఇవి కాక ఆరోగ్యానికి సంబంధించి చిన్నారులను చైతన్య వంతులను చేయడానికి కూడా తన మ్యాజిక్కులను ఉపయోగిస్తుంటాడు. మరీ ముఖ్యంగా స్కూలు పిల్లలకు చేతులను పరిశుభ్రంగా వుంచుకోవడం (భోజనానికి ముందు తర్వాత) గురించి ఎక్కువగా ప్రచారం చేస్తాడు. మురికివాడల్లోని స్కూళ్లనే కాదు. పెద్ద పెద్ద పాఠశాలలను కూడా విడిచిపెట్టడు. ఇవికాక రక్తదానం గురించి జనాల్లో అవగాహన కల్పించడానికి కూడా ప్రచారం చేస్తాడు. తను కూడా క్రమం తప్పకుండా రక్తదానం చేస్తుంటాడు. అవయవ దానం గురించి కూడా చైతన్యం కలిగించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తాడు. వారందరికీ మార్గదర్శకంగా నిలవడానికి తను గతంలోనే అవయవదానం కూడా చేసేశాడు. జీవితం చాలా చిన్నది. సంతోషంగా వుండాలన్నది అతని నినాదం. నౌకా దళంలో పనిచేసే వ్యక్తికి మ్యాజిక్కుల పట్ల ఆసక్తి ఎలా కలిగింది? అన్న ప్రశ్న తలెత్తకుండా ఎలా వుంటుంది ఎవరికైనా. ఓసారి అతనికెవరో కొన్ని మేజిక్ బాక్స్ బహూకరించారు. అందులో వున్న మూడు నాలుగు మ్యాజిక్కులను చాలా ఆసక్తిగా నేర్చుకున్నాడు. తర్వాత మ్యాజిక్కు పుస్తకాలను ఫుట్‌పాత్‌ల మీద దొరికే మ్యాజిక్ పుస్తకాలను కొని మరీ చదవడం, సాధన చేయడం మొదలెట్టాడు. కుటుంబ సభ్యుల ముందు మొదటి ప్రదర్శన ఇచ్చాడు. ఆ తర్వాత తన చిన్ని తమ్ముడి సాయంతో ఇంట్లోనే డబ్బు తీసుకుని మ్యాజిక్ షో చేశాడు. అదీ మనిషికి పావలా చొప్పున వసూలు చేశాడు. విజయవంతంగా ముగిసింది ప్రదర్శన. ఇహ అక్కడి నుంచి మ్యాజిక్కులు చేయడం ఆపలేదు. కాలేజీలో...అనంతరం నేవీలో పనిచేసేప్పుడు. తన చుట్టూ వున్నవారిని నవ్వించడానికి, సంతోషపెట్టడానికి ఇంద్రజాలం చేసేవాడు. ఇప్పుడు జబ్బు పడిన చిన్నారులకు సంతోషం పంచడానికి మ్యాజిక్కులను సాధనంగా ఎంచుకున్నాడు. ప్రస్తుతం ఇద్దరు కుమార్తెలు కూడా ప్రదర్శనలతో సాయంగా వుంటారు. ✦



◆ కళ

అందుకే లొంగిపోయాడు

తెలుగు నేలపై విరిసిన విప్లవ కుసుమం. మన్యం ప్రజల కష్టాలను కడతేర్చేందుకు తన జీవితాన్నే పణంగా పెట్టిన ఆదర్శమూర్తి. భరత జాతిని తెల్లదొరల దాస్యశృంఖలాల నుండి విముక్తి చేయుటకై ప్రాణాలను సైతం లెక్కచేయని ధీశాలి... విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు. తన లక్ష్యం కోసం కుటుంబ జీవితాన్ని సైతం పరిత్యజించిన మహామూర్తి ఆయన. రామరాజు ధైర్యసాహసాలకు తెల్ల దొరలు సైతం అచ్చెరువొంది, మాతో చేతులు కలుపు, కావల్సినన్ని కానుకలు సొంతం చేస్తామని అర్థించారు, వాటన్నింటినీ ఛీ కొట్టి....ప్రాణాలనే పణంగా పెట్టిన సీతారామరాజు చరిత్రలో నిత్యం వెలిగే చైతన్య స్ఫూర్తి. పరాయి పాలన పీడనుండి దేశాన్ని రక్షించడం కోసం నూనూగు మీసాల వయస్సులోనే ఆయుధం పట్టి బ్రిటీషు అధికారులకు ముచ్చెమటలు పట్టించిన అల్లూరి జీవితం భావితరాలకు ఆదర్శం.

మన్యం విప్లవంలో ఆంగ్ల ప్రభుత్వ బలం పుంజుకొంటూవున్న తరుణంలో సీతారామరాజు అంతరంగం ఆందోళనకు లోనైంది. తన అనుచరులైన మల్లుదొర శతృవులకు బంధీగా చిక్కాడు. అగ్గిరాజు అందుబాటులో లేడు. అనుచరుల సంఖ్య తక్కువ. దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. దానికి తోడు మన్యంలో, మలేరియా పీడించి ప్రజలను నిర్వీర్యులను చేస్తుంది. ప్రభుత్వ పెత్తందార్లు ప్రజలను పెడుతున్న బాధలకు అంతూ పొంతూ లేదు. వ్యవసాయవృత్తులు సాగక, తిండిగింజలు దొరకక ప్రజలు కరువుతో విలవిలలాడుతున్నారు. అంతేకాదు అమాయకులైన ప్రజలను ప్రభుత్వ తాబేదారులు అదిరించి, బెదిరించి, చిత్రహింసల పాలు చేస్తున్నారు.

ఎంతో నిగ్రహంతో అన్ని బాధలను ఓర్చి, ఓర్చి, చివరకు ప్రజలు కూడా విసిగి, విప్లవ భావాలు విడిచి ఏమీ చేయలేని స్థితికి దిగజారి పోయారు. అయినా, తుది ప్రయత్నంగా రాజు “పర్లాకిమిడికి” వెళ్లి, కొంత బలగాన్ని వెంటబెట్టుకొని మన్యం చేరుకున్నాడు. అప్పటికే మన్యంలో అశాంతి, నిరుత్సాహము తాండవిస్తున్నాయి.

నిరుత్సాహంలో కొట్టుమిట్టాడుతున్న ప్రజలతో ఇంక పోరాటాన్ని సాగించడం నిష్ప్రయోజనమని అతడు తీర్మానించుకొన్నాడు. అయితే ఇక చేయవలసిన పని ఏమిటి? అనేది అతని ముందు నిలిచిన పెద్ద సమస్య. విప్లవాన్ని నడిపిన తన కోసం ఆంగ్ల సైనికులు అహోరాత్రాలు మన్యాన్ని గాలిస్తున్నారు. ఊళ్లపైబడి ప్రజలను హింసిస్తున్నారు. వారి ఆస్తులనే గాక, ధన మాన ప్రాణాలను కూడా దోచుకుంటున్నారు. సర్వత్రా అశాంతి అలముకొని, మన్యమంతా మూగగా రోదిస్తోంది.

ప్రజలను కష్టాల నుండి విముక్తులను చేయాలని తాను తలపెట్టిన ఉద్యమం పరిపాలకుల దాష్టీకాలకు బలై, తుదకు ప్రజలకే శాపంగా పరిణమించింది. అందుకు పూర్తిగా తానే కారణమనుకొన్నాడు రాజు. తాను ప్రభుత్వానికి లొంగిపోనంతవరకూ మన్యానికి, మన్య ప్రజలకు మోక్షంలేదని భావించాడు. వెంటనే ఆయుధాలను విడిచి, తనకు మిత్రుడైన “మంప” గ్రామ మునసబు ఇంటికి చేరుకున్నాడు. తన నిర్ణయాన్ని అతనికి చెప్పాడు. మునసబు రాజు నిశ్చయాన్ని కాదనలేక తన బాధనంతా దిగమింగి ఊరుకొన్నాడు. రాజు జితేంద్రియుడు. కష్టసుఖాలను సమానంగా స్వీకరించ గల మహనీయుడు. నిండు హృదయంతో

మరునాటి ఉదయం సెలయేరులో బాలభానుడికి అర్ఘ్యమిస్తూ తన ఉనికిని గురించి, సమీపంలోని సైనిక శిబిరానికి కబురు చేశాడు. వెంటనే ఒక పోలీసు ఉద్యోగి, భయపడుతూనే రాజువద్దకు వచ్చి, అతనిని బంధించి సార్జెంట్ “గుడాల్” వద్దకు తీసికొని వెళ్లాడు. ఇదిగాక, రాజు తనకుతానై పట్టుబడిన వృత్తాంతాలు అనేక విధాలుగా ప్రచారంలోకి వచ్చాయి. అయితే, పోలీసు నివేదికలోని కథ వేరుగా ఉంది.

1924 మే నెల 7వ తేదీ... రాజు దాహము తీర్చుకోవడానికి ఒక ఏటి దగ్గరకు వచ్చాడు. అతనిని చూసిన కొందరు ఆ విషయాన్ని అక్కడే మాటువేసిన ఆంగ్ల సైన్యానికి తెలియచేశారు. ఇన్‌స్పెక్టర్ ఆళ్వార్ నాయుడు మలబారు స్పెషల్ పోలీసులను వెంట బెట్టుకొని, తుపాకులు గురిపెట్టి రాజును బంధించి, మేజర్ గుడాల్ కు అప్పజెప్పాడు.

గూడాల్ రాజు దగ్గరకు వెళ్లి కరచాలనం చేయబోయాడు. రాజు దానిని తిరస్కరించాడు. ఆంగ్లేయులను వారి సామ్రాజ్యవాద దృష్టిని విమర్శించాడు. దాంతో ఇరువురి మధ్య తీవ్రమైన వాగ్వివాదము చెలరేగింది. చివరకు గూడాల్ కోపోద్రేకుడై కోర్టు మార్షల్ చర్యకు ఆజ్ఞాపించాడు. మలబార్ స్పెషల్ పోలీసులు రాజును అక్కడ ఉన్న చెట్టుకు చేతులు విరిచి కట్టివేశారు. వెంటనే గూడాల్ కాల్పునకు హుకుం జారీచేసాడు. జమేదారు మొదట తుపాకీ కాల్చాడు. కాని అది రాజు ఎడమచేయి పైభాగానికి తగిలింది. అది సరిగాదని, గూడాల్ తన రివాల్వర్‌తో స్వయంగా రాజు గుండెకు గురిచూచి కాల్చాడు.. రాజు తల ఒరిగిపోయింది. అంతిమశ్వాస అనంతవాయువులలో కలిసిపోయింది.

మృతవీరునికి రక్తారుణమైన అంజలి ఘటిస్తూ పశ్చిమదిశ గర్భంలోకి అస్తమయభానుడు మునిగిపోయాడు. తమ బిడ్డ... తమ సోదరుడు 27 ఏళ్లకే నూరేళ్లు నిండి పాశ్చాత్య ప్రభుత్వ పశుబలానికి బలి అయిపోయాడని ఆంధ్ర ప్రజా హృదయం తల్లడిల్లిపోయింది. ఆ మహావీరునకు అమృత హారతుల నెత్తింది. భారత మాత సుపుత్రులలో ఒక పుత్రరత్నం కాలగర్భంలో కలిసి పోయింది. అతడు మహాపురుషుడు, త్యాగమూర్తి అమృత హృదయుడు ...అమరుడు.. ✦

పెళ్లి బొకేల సేకర్త

చర్చిల్లో జరిగే వివాహాలు చూస్తూనే వుంటాం. వివాహం అయ్యాక నూతన వధువు వరుడితో కలిసి వెళ్తూ తన చేతిలోని పూల గుత్తిని వెనక్కి విసిరేస్తుంది. అప్పుడు దాన్ని సొంతం చేసుకోవడం కోసం ఆ పెళ్లికి హాజరైన అవివాహితలు పోటీ పడుతుంటారు. అలా ఎవరైతే ఆ బొకేని సొంతం చేసుకుంటారో వారికి త్వరగా పెళ్లి అవుతుందన్నది వారి విశ్వాసం. అలాంటి 46 బొకేలను సేకరించింది జామి జాక్సన్. కాకపోతే ఈ అమెరికా అమ్మడు ఇంకా బ్యాచిలరే. "నాకు పెళ్లి పూల గుత్తులను పట్టుకోవడమంటే సరదా. ఇప్పటికి 46 బొకేలను సంపాదించా. అన్నిటినీ ఓ బీరువాలో పెట్టాను. ఇలాంటివి మరిన్ని పూల గుత్తులను సంపాదించాలని కోరిక. నేనే కనక పెళ్లి చేసుకుంటే ఆ కోరిక తీరదు కదా. అందుకే బ్యాచిలర్‌గానే వుండిపోయా" అంటుంది సరదాగా జామి జాక్సన్.

'చెత్త' బట్టలు

ఎప్పటి కప్పుడు కొత్త రకం బట్టలను తయారుచేయడమంటే కొందరికి చాలా ఇష్టం. వీరినే కాస్ట్యూమ్ డిజైనర్లని కూడా అంటుంటారు. అయితే కొందరికి రొటీన్‌గా చేయడం ఇష్టముండదు. అలాంటి వారిలో క్రిస్టిన్ అలైస్ ముందుంటుంది. ఆమెకు కాలేజీలో చదువుకునే రోజుల్లోనే ఒక ఆలోచన వుంది. మనం రోజూ బోలెడంత చెత్త పడేస్తుంటాం కదా. దాన్నుంచి బట్టలు తాయారుచేస్తే ఎలా వుంటుందీ అని. అంతే నేస్తాలతో కలిసి చెత్తను పోగు చేయడం మొదలెట్టింది. అంటే అట్టపెట్టెలు, ప్లాస్టిక్ కవర్లు, బహుమతులను ప్యాక్ చేసే తగరపు కాగితాలు, ఖాళీ చేసిన కూల్‌డ్రింకు కాగితపు డబ్బాలు...ఇలాగన్నమాట. ఇక చూస్కోండి! వాటి నుంచి రకరకాల డ్రెస్సులు తయారుచేసింది. వాటిని చూసి మిత్రులే కాదు. ఇరుగు పొరుగు కూడా తెగ మెచ్చేసుకున్నారు క్రిస్టిన్‌ను. కేవలం ఆడవాళ్లకే కాదు! మగవారికీ డ్రెస్సులు తయారుచేయసాగింది. టై మొదలుకొని వివిధ రకాల ఫ్యాషన్ బట్టల వరకు చెత్తతోనే రూపొందిస్తుంది. వీటికి ఆన్‌లైన్లో మంచి డిమాండ్ వుంది కూడా. జనం విరగబడి కొనుక్కుంటున్నారట. అన్నట్టు న్యూయార్క్‌లో సొంత కంపెనీకూడా ప్రారంభించింది.

ఆమె ... కత్తిని మింగేస్తుంది

నిండు గర్భవతి. వయసు 27. పేరు వెరోనికా హెర్నాండెజ్. నివాసం టెక్సాస్‌లో. చూశారుగా! ఇలాంటి సాహసకృత్యాలు చేయడంలో ఈమెది ప్రత్యేక శైలి. 14 అంగుళాల కత్తిని నోట్లోంచి పొట్టలోకి దించుకోవడం చూసిన వారికెవరికైనా నోట మాట రావాలంటే కొంత సమయం పడుతుంది. లోపల బిడ్డకేమైనా అవుతుందేమో! తనకే ఏదైనా ప్రమాదం జరుగుతుందేమో! అని భయంతో బిగుసుకుపోయి కూర్చుంటారు ప్రేక్షకులు. ఆమె మాత్రం చాలా ప్రశాంతంగా కత్తిని అవలీలగా నోట్లోకి దించుకుని మళ్లీ బయటకు తీస్తుంది. కాకపోతే ఆమె కళ్లు కాస్త తడి అవుతాయంతే. "నేను మొదటిసారి గర్భం దాల్చినప్పుడు ఈ కత్తి ఫీట్‌కు దూరంగా వున్నాను. అయితే కత్తితో సాహసకృత్యాలు చేయడంలో మాంచి ప్రతిభ కలిగిన వారి దగ్గర నేర్చుకున్నాను. ఇందుకోసం రెండున్నరేళ్ల పాటు సాధన చేశాను....' అంటుంది నవ్వుతూ వెరోనికా. ఊపిరితిత్తులు, గుండె, కిడ్నీలు ... దేనికీ ఏమీ కాకుండా కత్తి ఫీటు చేయడమంటే మాటలా! అయితే ఇక్కడ ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. నిపుణుల దగ్గర ఎటువంటి శిక్షణ లేకుండా...ఒంటరిగా ఇలాంటి ఫీట్లు చేయడానికి ప్రయత్నించకూడదని వెరోనికా సూచన.

◆ కథ

అమ్మకో మాట

- కాండ్రేగుల శ్రీనివాసరావు

సెల్: 9885139993

సెల్‌ఫోన్‌లో అలారం అదే పనిగా మోగుతూ ఉంటే ఆ శబ్దానికి ఉలిక్కి పడి లేచింది శ్రీవల్లి. కనురెప్పల్ని భారంగా పైకి లేపి, గోడ గడియారం వంక చూసింది. సమయం తెల్లవారుజాము నాలుగు గంటలు కావొస్తుంది. నిద్ర తీరని కనులు ఇంకాస్త విశ్రాంతిని కోరుకుంటున్నాయి. శరీరం పరుపును వదలనంటోంది. కానీ తప్పదు... లేవాలి. మమ్మీ వచ్చి, బెడ్ రూమ్ కిటికీ దగ్గర నిల్చోని తను చదువుతుందో లేదోనని చూస్తుంది. లేవకపోతే పెద్దగా అరుస్తుంది. లేవక తప్పదు.

తన ఇల్లు తనకొక పెద్ద హాస్టల్.. అందులో మమ్మీ వార్డెన్...

తను ఈ ఇంట్లో పుట్టకుండా ఉండాల్సింది అనుకుంది యధాలాపంగా.

తరుచూ అలా అనుకుంటూనే ఉంటుంది శ్రీవల్లి. అలా అనుకోని రోజు అంటూ లేదు.

హైస్కూల్ చదువు వరకు తను మంచి మార్కులతో పాసవుతూ, ఆడుతూ పాడుతూ సరదాగా గడిపింది. ఆ తర్వాతే ఈ అవస్థలు ప్రారంభమైనాయి. టీనేజీ లైఫ్ నరక ప్రాయమైంది.

తన తల్లిదండ్రులకు ఎవరు చెప్పారో, ఏమి చెప్పారో తెలియదు గానీ, తనని డాక్టర్‌ని చేయాలనే సంకల్పం వాళ్లలో జనయించింది. అది వారి మనసులో నుంచి వచ్చిన నిజమైన సంకల్పం కాదు. సొసైటీలో గుర్తింపు కోసం తహ.. తహ.. ప్రాకులాట...తెచ్చిన తంటాలివన్నీ.

"నువ్వు ఎమ్‌సెట్‌లో ర్యాంక్ తెచ్చుకోవాలి.. డాక్టర్ సీటు సంపాదించాలి" అని డాడీ ఎప్పుడూ చెబుతూనే ఉంటారు. మమ్మీ చెప్పేది కూడా అదే.. తప్పకుండా నువ్వు డాక్టర్‌వి కావాలి. బంధువుల దగ్గర మా పాప డాక్టర్ చదువుతోందని గర్వంగా చెప్పుకోవాలి నేను. మేనేజ్‌మెంట్ కోటాలో సీటు కొనే స్తోమత మనిది కాదని గుర్తుంచుకో, బాగా కష్టపడాలి..."

* * *

హైస్కూల్ నుండి కార్పొరేట్ కాలేజీలో అడుగుపెట్టింది. కొత్త వాతావరణం నిరంతరం ఉరుకులు పరుగులుతో అధ్యాపకులు.. ఆ బోధనా వేగాన్ని అందుకోలేకపోయేది తను. వాళ్లు చెబుతున్నదేమిటో అర్థం అయ్యేది కాదు. అలా అని తిరిగి అడిగితే, సందేహాలు తీర్చే ఓపిక, సహనం, సమయం, వాళ్లకు ఉండవు.

పదోవ తరగతిలో ఎనభై ఎనిమిది శాతం మార్కులు తెచ్చుకోవటమే తను చేసిన పెద్ద తప్పు. డాక్టర్ టార్గెట్ మత్తులో ఉన్న తన పేరెంట్స్, బైపీసీలో మెడిసిన్‌లో జాయిన్ చేశారు. ఒక వైపు అర్థంకాని సిలబస్... రెండో వైపు ఎమ్‌సెట్ కోచింగ్... ఫిజిక్స్, కెమిస్ట్రీ క్లాసులంటే భయంతో చచ్చేది శ్రీవల్లి. బోటనీ, జూయాలజీ ఓ మోస్తారుగా అర్థం అవుతూ ఉండేవి.

రోజంతా క్లాసు పుస్తకాలలో తలమునకలై ఉండి, రాత్రి ఎడుకో, ఎనిమిదికో, ఈసురోమంటూ ఇల్లు చేరే సరికి, హార్లిక్స్ గ్లాసుతో మమ్మీ ద్వారం దగ్గర సిద్ధంగా ఉండేది. కాలేజీ నుండి ఇంటికి అంటే, పిల్లలు రిలాక్స్ ఫీలవుతారు. కానీ తనకి ఆ అదృష్టం కూడా లేదు. ఎందుకంటే తన ఇల్లు కూడా ఓ కాలేజీ లాంటిదే..

మళ్లీ పుస్తకాలు పట్టుకోవడం, పిచ్చెక్కిపోయేలా ఉండేది. అప్పుడప్పుడు విపరీతమైన తలనొప్పి కూడా వస్తుండేది. తన తల్లిదండ్రుల ప్రవర్తన చూసి ఆ క్యాంపస్ ఇన్‌చార్జి అననే అన్నాడు.

"డాక్టర్ ఇంజనీర్లు, ఈ కోర్సులే కాదు... పిల్లలు ప్రయోజకులవటానికి చాలా కోర్సులు ఉన్నాయి. కానీ వేలం వెర్రిగా పేరెంట్స్ అందరూ ఇటు వైపే ఆసక్తి చూపిస్తూంటారు. మీకో సంగతి ఫ్రాంక్‌గా చెప్పదలుచుకున్నాను. క్యాంపస్ ఇన్‌చార్జిగా, కాకుండా ఓ పేరేంట్‌గా నిజాయితీగా చెబుతున్నాను. ఈ క్యాంపస్ పెట్టి పదేళ్లు అవుతుంది. ఇక్కడ నుండి మెడిసిన్‌లో సీటు సంపాదించిన వాళ్లు నలుగురు, అయిదుగురు మాత్రమే ఉన్నారని నేను చెబితే మీరు ఆశ్చర్యపోతారు. అలాగని మా బోధనలో లోపం కాదు. మెడిసిన్ సిలబస్ అంత కష్టతరంగా ఉంటోంది. టెన్త్ మార్కులు చూసి, భారీగా ఫీజులు చెల్లించేస్తూ జాయిన్ చేసేస్తారు మీరు. ఆనక చదవలేక పిల్లలు అవస్థలు పడతారు. అమ్మాయితో మాట్లాడి ఆమె ఇష్టాన్ని తెలుసుకుని ఓ సారి శాంతంగా ఆలోచించి నిర్ణయం తీసుకోండి..."

ఆ పెద్దాయన అంతగా నచ్చచెప్పినా సరే తన

పేరేంట్స్‌లో మార్పురాలేదు.
"లేదు లేదు... మేము పూర్తిగా డిసైడ్ అయ్యే వచ్చాం.. ఇందులో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదు. మా అమ్మాయిని డాక్టర్ని చేయడమే మా లక్ష్యం" అంటూ పట్టుబట్టి మరీ తనని జాయిన్ చేశారు.

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు పూర్తి కావొచ్చాయి. మార్కులు పర్సంటేజీ మంచిగానే వచ్చింది. రెండో సంవత్సర ఫలితాలు... అవి కూడా బాగానే వచ్చాయి. ఇక మిగిలింది ఎమ్‌సెట్ ఎగ్జామ్?

ఆ రోజు రానే వచ్చింది.. తన పేరేంట్స్ ఆ రోజు ఉదయాన్నే గుడికి తీసుకువెళి పూజలు చేయించారు. పరీక్షహాలుకి తనని తీసుకుని ఇద్దరూ వచ్చారు.

ఎగ్జామ్ హాలులోనికి వెళ్తూంటే, అడుగులు తడబడ్డాయి శ్రీవల్లికి. తన ప్లేస్‌లో కూర్చున్నప్పుడు, ఓ.ఎమ్.ఆర్ ఆన్సర్ పేపర్ అందుకుంటున్నప్పుడు, గుండె దడ దడలాడసాగింది. ఎగ్జామ్ రాస్తూన్నంత సేపు బయట కూర్చున్న తల్లిదండ్రులే గుర్తుకొచ్చారు. తను ఫెయిలయినట్లు, వారు తన మీద విరుచుకుపడుతున్నట్లు ఊహలు వస్తున్నాయి.

ఆ మూడు గంటలూ, తీవ్ర ఒత్తిడికి లోనై, బబ్లింగ్ విధానంతో ఆన్సర్ షీటు ఎలాగో పూర్తి చేసింది శ్రీవల్లి. ఎగ్జామ్‌హాలు నుండి బయటకు రాగానే పేరేంట్స్ ప్రశ్నల వర్షం కురిపించారు. వాళ్ళకి సమాధానం చెప్పేసరికి తల ప్రాణం తోకకు వచ్చినట్లైంది. ఆ మరుసటి రోజు ఎమ్‌సెట్ 'కీ' దిన పత్రికలో రిలీజు అయింది. శ్రీవల్లి తను రాసుకున్న ఆన్సర్ షీటుతో సరిచూసుకుంది. దాంతో ఆమె మొహం పాలిపోయింది. ఎగ్జామ్ తను సరిగా రాయలేకపోయిన సంగతి గ్రహించింది. ఈ విషయాన్ని అమ్మానాన్నలకు చెప్పలేకపోయింది, కానీ.. ఎన్ని రోజులని దాచగలదు???

ఫలితాలు వెలువడ్డాయి. తను ఘోరంగా విఫలమైంది. అంతే....అనుకున్నట్టుగానే తల్లిదండ్రులు తనపై విరుచుకుపడ్డారు. ఎన్నో తిట్టారు. అనరాని మాటలన్నీ అన్నారు. ఏం చేయలేని నిస్సాహాయతతో గాయపడిన మనసుతో నిశ్శబ్దంగా రోదిస్తూ, తనలో తాను రగిలిపోతూ, కన్నీరు కారుస్తూ, మౌనంగా ఉండిపోయింది శ్రీవల్లి.

* * *

ఇంటర్, ఎమ్‌సెట్ రెండింటిమీద కాన్‌సన్‌ట్రేషన్ చేయటంవల్ల ఫెయిల్ అయిందని తేల్చారు వాళ్లు. లాంగ్‌టర్మ్ కోర్సులో జాయిన్ చేయటానికి సిద్ధమైపోయారు. అప్పుడు కూడా తన ఆసక్తి గురించిగానీ, తన ఇంట్రెస్ట్ గురించి కానీ ఒక్క మాటైనా అడగలేదు తనని.

అవే బుక్స్, అదే సిలబస్, చదివిందే చదవటం... ఆసక్తి లేని సబ్జెక్ట్స్, నిరాసక్తిని కలిగించే భవిష్యత్.. శ్రీవల్లికి జీవితం అగమ్యగోచరమై కనిపిస్తూ ఉండేది.

సహజంగా ఆ వయసు అమ్మాయిలలో ఉండే చలాకీ తనం, చురుకుదనం శ్రీవల్లిలో క్రమేణా తగ్గసాగాయి. రోజంతా దిగులుగా ఉండటం, నిరుత్సాహంగా గడపటం చేస్తూ ఉండేది. రోజులు గడుస్తున్న కొద్దీ శ్రీవల్లికి తన మానసిక పరిస్థితి దిగజారుతున్నట్లు అనిపించేది.

రెండోవసారి, ఎమ్‌సెట్ పరీక్షకేంద్రంలో భయపడుతూ అడుగు పెట్టింది. పేపర్ తీసుకుని ఆన్సరింగ్ చేస్తూ ఉంటే చేతులు వణకసాగాయి. ఆందోళనతో గుండె అదరసాగింది. ఆ మూడు గంటలూ అతి కష్టంమ్మీద గడిపి బయటకు వచ్చింది.

ఫలితాలు వచ్చాయి. షరా మామూలే.. శ్రీవల్లి ర్యాంకు తెచ్చుకోలేకపోయింది. పేరేంట్స్ సంగతైతే ఇక చెప్పనవసరమే లేదు. కూతురు ఆ కోర్సుని అందుకోలేక పోవటం గురించి ఆలోచించటంలేదు వాళ్లు. ర్యాంకు రాక పోవటం గురించి, నలుగురూ ఇప్పుడు అడిగితే వాళ్లకేం చెప్పాలి. అని పరువు గురించి పదే పదే ఆలోచిస్తున్నారు.

తర్వాత ఏడాది మళ్లీ లాంగ్ టర్మ్‌కు జాయిన్ అయింది శ్రీవల్లి. కాదు.. కాదు.. బలవంతంగా జాయిన్ చేయబడింది. ఈ విడత ఆమె ఆరోగ్య పరిస్థితి మరీ దిగజారసాగింది. తనలో ఏదో అవుతుండేది. ఆ మార్పు స్పష్టంగా తెలుస్తూండేది. తల తిరగటం, వికారంగా ఉండటం, విపరీతమైన తల నొప్పి రావటం జరుగుతూంది. పేరేంట్స్‌కి చెప్పినా ఫలితం ఉండదనిపించింది. ఎందుకంటే చదువు నుండి తప్పించుకోవటానికే ఈ సాకులన్నీ అని అనుకుంటారు వాళ్లు.

మూడోవసారి శ్రీవల్లి ర్యాంకు సంపాదించుకుంది.

తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. మంచి గవర్నమెంట్ కాలేజీలోనే సీటు వచ్చే అవకాశాలున్నాయని అందరూ అన్నారు. ఉప్పొంగిపోతున్న ఆనందంతో చిన్న పార్టీ ఏర్పాటు చేశారు శ్రీవల్లి తల్లిదండ్రులు. మిత్రుల్ని, ఇరుగుపొరుగు వారిని, బంధువుల్ని ఆహ్వానించారు.

అందరూ పుష్పగుచ్ఛాలు ఇస్తూ, కంగ్రాట్స్ చెబుతూ శ్రీవల్లిని అభినందించారు.

పార్టీలో అందరి మధ్య, ఎటువంటి ఉత్సాహం లేకుండా, కేక్ కట్ చేసింది శ్రీవల్లి. అందరూ ఆనందంతో చప్పట్లు కొడుతూ ఉండగా, శ్రీవల్లికి ఏమైందో తెలియదు. ఒక్కసారిగా కుప్పగా కూలబడిపోయింది. ఆలస్యం చేయకుండా హాస్పెటల్‌కి తీసుకుపోయారు.

శ్రీవల్లి కోమాలోకి వెళ్లిపోయింది. బ్రెయిన్ స్ట్రోక్‌గా నిర్ధారించారు డాక్టర్లు.

"పర్లేదు.. ఆమెకి ఏం కాదు.. కోమా నుండి కోలుకుని బయటపడుతుంది. కాకపోతే అందుకు సమయం పడుతుంది. యాభైఏళ్లు పైబడిన వాళ్లకి రావలిసిన డిసీజ్ ఇది. వాతావరణం, తినే ఆహారపదార్థాలు, విపరీతమైన మానసిక వత్తిడిలాంటి కారణాల వల్ల ఈ వయసు పిల్లలకు కూడా ఇటీవల ఈ జబ్బులొచ్చేస్తున్నాయి. డాక్టర్‌ని చేయాలనే తపనతో అమ్మాయి మీద విపరీతమైన ఒత్తిడి పెట్టి ఉంటారు మీరు.. ఇప్పుడేమైంది? అమ్మాయికి ర్యాంకు వచ్చింది. కానీ ఏం ప్రయోజనం? ఫిజికల్ ఫిట్‌నెస్ లేకుండాపోయింది. ఎందరికో వైద్యం చేయవలసిన అమ్మాయి, తనే వైద్యుల పర్యవేక్షణలో ఉండవలసిరావటం నిజంగా దురదృష్టకరం.. ఆ అమ్మాయి జీవితాంతం మందులు వాడవలసిన అఘాయిత్యం ఏర్పడింది..."

శ్రీవల్లికి ట్రీట్‌మెంట్ చేస్తున్న, డాక్టర్ ఫణీంద్ర మందలించారు ఆ తల్లిదండ్రులను.

వారం తరువాత స్పృహలోకి వచ్చి, క్రమంగా కోలుకోసాగింది శ్రీవల్లి.

ఒక రోజు....

ఇంట్లో, శ్రీవల్లి గదిని శుభ్రపరుస్తున్న వాళ్ల అమ్మకు, కూతురి చేతి దస్తూరితో ఉన్న అసంపూర్ణమైన ఉత్తరం ఒకటి దొరికింది. ఆమె దానిని ఆత్రంగా చదవసాగింది.

"మమ్మీ.. ఎందుకిలా నన్ను కష్టపెడుతూ చదివించటం...? ఇష్టంగా చదవాలనుకున్న దాన్ని చదివించొచ్చు కదమ్మా.. డాక్టర్ కోర్సు నాకు వద్దు.. ఈ ఒత్తిడిని నేను భరించలేక పోతున్నాను.. ఈ గెలుపుని నేను అందుకోలేకపోతున్నాను. ఈ పరుగు పందెంలో నేను నెట్టుకు రాలేకపోతున్నాను. ఎన్నోసార్లు నీకు చెప్పాలనుకున్న మాట పెదవి దాటి బయటకు రాలేకపోయిందమ్మా... చెబితే ఏ ఉపద్రవం, ఏ ప్రళయం వస్తూందోనని భయం... అంతే... "

ఆ ఉత్తరం ఆమె మనసుని కెలికినట్లయింది.

భర్తకు చూపిస్తూ " మనం తప్పు చేశామండీ..." అంటూ బావురుమన్నది ఆమె.

శ్రీవల్లి క్రమంగా కోలుకుంటోంది. ✦

నవ్వుల్ – పువ్వుల్

పాసైనట్టే

రమేష్ : అదేంట్రా... రెండూ ఒకే రకమైన పుస్తకాల్ని కొన్నావు?

సురేష్ : ఈ పుస్తకం చేతిలో ఉంటే సగం పరీక్షలు పాసైనట్టే అని దీనిపై రాసుంది. అందుకే రెండు కొన్నాను.

ఎందుకండీ?

భార్య : వింటున్నారా! మనం ఈ వారం సినిమాకెళదాం. వచ్చే వారం షాపింగ్‌కి వెళదాం.

భర్త : అయితే ఆ తర్వాత వారం వెళ్లేది గుడికేనన్న మాట.

భార్య : ఎందుకండీ?

భర్త : మరి ఆ రెండు అయిపోయిన తర్వాత వెళ్లాల్సింది గుడికేగా...అడుక్కోటానికి.

తొందరపాటు

"మనమ్మాయికి మంచి అందగాడిని, తెలివితేటలు గలవాడిని, ఆస్తిపరుడ్ని వరుడిగా తేవాలనుకుంటున్నాను" భార్యతో చెప్పాడు రఘురాం.

"నిజం చెప్పారండీ! ఈ విషయంలో మాత్రం మా నాన్నలా మనం తొందరపడకూడదు"అని సెలవిచ్చింది భార్య.

నా కోసం



పుంజు : ఐ లవ్ యు

పెట్ట : నువ్వు నా కోసం ఏం చేస్తావు?

పుంజు : ఏదైనా చేస్తాను.

పెట్ట : అయితే ఒక గుడ్డు పెట్టు చూద్దాం!

వాగ్దానం

"ఏమండీ! మొన్న ఎన్నికల్లో గెలిస్తే నాకు రవ్వల నక్లెస్ కొనిపెడతానన్నారు. గెలిచి ఆరునెలలు దాటింది. మళ్లీ ఆ ఊసే ఎత్తలేదు" గోముగా అడిగింది సుబ్బు లక్ష్మి.

"ఓట్ల కోసం ఎన్నో వాగ్దానాలు చేస్తాం. అవన్నీ తీరుస్తారా ఎవరైనా సుబ్బు" అన్నాడా రాజకీయనాయకుడు.

చెప్పు

"నువ్వు ప్రతి అమ్మాయినీ ఏ పార్కుకో, బీచికో తీసుకెళ్లకుండా గుడిలోకి తీసుకెళ్లి ఐలవ్‌యు అని చెబుతావెందుకు?' సందేహంగా అడిగాడు శేఖర్.

"గుడిలో అయితే చెప్పులేసుకోడానికి వీలుకాదు కదా" చెప్పాడు రాజు.

వద్దురా!

కొడుకు : నాన్న..నాన్న నాకు సన్నాయి నేర్చుకోవాలనుండి. నాకు ఒక సన్నాయి కొనిపెట్టు.

తండ్రి : వద్దురా! వేళాపాళ లేకుండా వాయిస్తే ఇంట్లో గోలగా ఉంటుంది.

కొడుకు : "ఫర్లేదు నాన్న...మీరంతా నిద్ర పోయాకే వాయిస్తాను" అన్నాడు అమాయకంగా.

తేడా

భాను: ఒరేయ్ శీను,పులికి, మేకకి తేడా ఏంటో చెప్పు?

శీను : ఒకటి క్రూర జంతువు. ఇంకొకటి కూర జంతువు.

ఆపరేషన్



"చూడండి! వెంకయ్య...ఈ జబ్బు మీతో రాలేదు. వంశపారంపర్యంగా వచ్చింది. ఆపరేషన్ చేస్తే పోతుంది" చెప్పాడు డాక్టర్.

"అయితే ఆ ఆపరేషన్ మా తాతయ్యకు చేయండి డాక్టర్" అన్నాడు వెంకయ్య.

ఇంగ్లీషు పేరు



టీచర్ : కళ్యాణ్! మీ నాన్న గారి పేరు ఇంగ్లీషులో రాయి.

విద్యార్థి: టెంపుల్‌స్టెప్స్ వాటర్ కింగ్ అని రాసి చూపించాడు.

టీచర్ : ఒరేయ్! నేను రాయమన్నదేంటి? నీవు రాసిందేమిటి...కోపగించుకున్నాడు టీచర్.

విద్యార్థి: నేను మా నాన్న పేరే రాసాను. ఆయన పేరు గుడిమెట్ల గంగరాజు.

ఇప్పుడంటే అన్నీ సాంఘిక చిత్రాలే వస్తున్నాయి. కానీ ఒకప్పుడు పౌరాణిక, జానపద, సాంఘిక, చారిత్రక చిత్రాలు విరివిగా వచ్చేవి. వాటిలో ఎక్కువ శాతం విజయవంతమయి నాటికాలం స్వర్ణయుగంగా బాసిల్లింది. నాటి చిత్రాల్లో శాస్త్రీయ రీతుల్లో సాగే నృత్య సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణలుగా ఉండి ప్రేక్షకాదరణ పొందేవి. యల్. విజయలక్ష్మి, పద్మినీ ప్రియదర్శిని, జ్యోతి, సుకుమారి, సరోజ వంటి నాట్య కళాకారిణులు ఎందరో ఉండేవారు. అందరిలోకి రాజసులోచన నాట్యతారగా సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టినా, కథానాయిక స్థాయికి ఎదిగి ప్రథమస్థానంలో నిలిచారు.

నాట్యలోచన రాజసులోచన

రాజసులోచన 1935 ఆగష్టు 15న జన్మించారు. ఆమె అసలు పేరు రాజీవలోచన. సినిమాలల్లోకి వచ్చిన తర్వాత రాజసులోచనగా పేరు మార్చుకున్నారు. చలన చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టక ముందు నాట్యప్రదర్శనలు ఇస్తూండేవారు. మొదటిసారిగా "గుణసాగరి" అనే కన్నడ చిత్రంలో కెమెరా ముందుకు వచ్చారు. ఆ సినిమా 1951లో ప్రారంభమై 1953లో విడుదలైంది. కానీ ఆ తర్వాత తెలుగులో నటించిన "కన్నతల్లి" సినిమా 1952లో విడుదలైంది. తెలుగులో ఆమె నటించిన మొదటి చిత్రం అది. మొదట్లో "కాళహస్తీశ్వర మహాత్మ్యం (1954)" వంటి చిత్రాల్లో వ్యాంప్ తరహాపాత్రలు పోషించినా ఘంటసాల నిర్మించిన "సొంత ఊరు (1956)" లో కథానాయిక అయ్యారు. ఆ చిత్రంలో యన్‌టిఆర్ నాయకుడు.

విఖ్యాత దర్శకుడు బియన్‌రెడ్డి "రాజమకుటం"లో మొదట హీరోయిన్‌గా సావిత్రని అనుకున్నారు. కానీ ఆ సమయంలో ఆమె గర్భవతిగా ఉండటం వల్ల ఆమె స్థానంలో రాజసులోచనను తీసుకున్నారు.ఆ చిత్రంలో సడిసేయకేగాలి" అనేపాట ఆమెకు ఎంతోపేరు తెచ్చింది.

"శాంతినివాసం"లో "రావెరాధా రాణీరావే!", "కంకంకం కంగారు నీ కేలనే" అనే పాటలు కూడా ఎంతో ప్రజాదరణ పొందాయి. ఆ పాటల్లో రాజసులోచన హుషారైన నటనకు ప్రేక్షకులు సమ్మోహితులయ్యారు. "సారంగధర లో కనకాంగిగా, "జయబేరి "లో రాజనర్తకి అమృతాంబగా, "బభ్రువాహన" లో నాగకన్య ఉలూచిగా, "పేదరాసి పెద్దమ్మకథ"లో మాయా మోహినిగా, "బాలనాగమ్మ లో సంగుగా అపూర్వ మైన అభినయం ప్రదర్శించారు. "మహాకవి కాళిదాసు" లో "జయజయజయ శారదా!" పాటలోనూ "వెలుగునీడలు" లో "పాడవోయి భారతీయుడా!"లోనూ, "పాండవ వనవాసం "లో "ఓ వన్నెకాడ"లోను, "ఏకవీర "లో యక్షగానంలోనూ అద్భుతమైన నాట్యం చేశారు.

"భాగ్యదేవత (1959)" చిత్రం నాటికి సావిత్రి పెద్ద స్టార్, అయినప్పటికీ ఆ చిత్రంలో రాజసులోచన హీరోయిన్‌గానూ, సావిత్రి సెకండ్ హీరోయిన్ గానూ నటించటం విశేషం. కథమొత్తం రాజసులోచన మీదే నడుస్తుంది.

యన్.టి.రామారావుతో "వాల్మీకి", "ఆప్తమిత్రులు" వంటి చిత్రాలలోనూ, నాగేశ్వరరావుతో "ఇద్దరు మిత్రులు", "శభాష్‌రాజా" లోనూ, హరనాథ్‌తో "ఋష్యశృంగ", శోభన్‌బాబుతో "మామకు తగ్గకోడలు" చిత్రాల్లో నాయికగా నటించారు.

యన్‌టిఆర్‌తో ఎన్నో చిత్రాల్లో భార్యగా, ప్రియురాలిగా నటించిన రాజసులోచన "మంచిమనుసుకు మంచిరోజులు"లో చెల్లెలిగా నటించారు. ఆసినిమాలో వారిద్దరిపై చిత్రీకరించిన "కలవారి స్వార్థం, నిరుపేద దుఃఖం" అనే పాట సూపర్ హిట్. రాజసులోచన ఒక ఇమేజ్ చట్రంలో ఇమిడిపోలేదు. హీరోయిన్‌గా మంచి పేరున్న సమయంలోనే "మాంగల్యబలం (1958)"లో హాస్యనటుడు రేలంగికి జోడీగా నటించారు. "శ్రీతిరుపతమ్మ కథ"లో వేశ్యపాత్ర పోషించారు. "సువర్ణసుందరి లో కథానాయకుడు అక్కినేని. కానీ ఆయన పాత్ర పరిధి తక్కువ. శాపం వల్ల స్త్రీ రూపం పొందుతాడు. స్త్రీగా మారినప్పుడు రాజసులోచన నటించారు. సగం కథ ఆమె మీదే నడుస్తుంది.

1967లో వచ్చిన "చిన్నారిపాపలు" చిత్రానికి పనిచేసిన వారందరూ మహిళలే! వి.సరోజిని నిర్మించిన ఈ చిత్రానికి సావిత్రి దర్శకత్వం, పి.లీల సంగీత దర్శకత్వం వహించగా, రాజసులోచన నృత్య దర్శకత్వం వహించారు. ఆ సినిమాకి ఆ సంవత్సరం రజత నంది లభించింది. ఆమె నటిగానే కాకుండా దేశవిదేశాల్లో నాట్య ప్రదర్శనలిచ్చి భారతీయ నృత్యాల ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పారు. 1970 తర్వాత హీరోయిన్‌గా వాణిశ్రీ వెల్లువ మొదలైంది. వదిన పాత్రలకు, తల్లి పాత్రలకు షిఫ్ట్ అయ్యారు రాజసులోచన. "మహాలక్ష్మి" వంటి చిత్రాల్లో వదిన పాత్రలు, "చిన్నకోడలు (1990)", "ఇరుగిల్లు – పొరుగిల్లు (1990), యువరాజు (1982)" వంటి చిత్రాల్లో తల్లి పాత్రలు పోషించారు. ఆమె 2013 మార్చి 5న కన్నుమూశారు. అభినయంలోనూ,నాట్యంలోనూ తనదైన ముద్రవేసి ప్రేక్షకుల హృదయంలో చిరస్థాయిగా నిలిచిపోయారు రాజసులోచన.

- గోనుగుంట మురళీకృష్ణ

◆ ప్రత్యేకం

నాన్నే నా హీరో

రెండు పదుల వయస్సుకూడా లేదు....అంతర్జాతీయ బ్యాడ్మింటన్ ఆటలో ప్రత్యర్థులకు గట్టిపోటీనిస్తున్న క్రీడా కెరటం. అమ్మాయిలు ఏం సాధించగలరు అంటూ పెదవి విరిచేవారికి ఒక సమాధానం. బ్యాడ్మింటన్‌లో ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో వరుసగా రెండుసార్లు విజయం సాధించడమేకాక...18 ఏళ్లకే అర్జున అవార్డు అందుకున్న క్రీడాకారిణి పుసర్ల వెంకట సింధు. ఈమె ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం పద్మశ్రీ అవార్డునూ ప్రకటించింది. పిన్నవయస్సులోనే అనేక పతకాలు సాధిస్తున్న సింధు ఏమంటుందో తెలుసుకుందాం!

మా నాన్న రమణ, అమ్మ పద్మ ఇద్దరూ జాతీయ స్థాయి వాలీబాల్ ప్లేయర్స్. నాకు పద్దెనిమిదేళ్ల వయస్సులో అర్జునా అవార్డు వచ్చింది. నాన్నకు నలభై ఏళ్ల వయస్సులో అర్జునా అవార్డు దక్కింది. ఈ విషయాన్ని ఆయన ఎప్పుడూ ఇతరులతో చెప్పి గర్వపడుతుంటారు. కానీ నా ప్రతి విజయం వెనుక అమ్మ, నాన్న మా కోచ్ గోపిచంద్ గారి ప్రోత్సాహం ఉండటం వలనే నేను ఈ స్థాయికి వచ్చానని అనుకుంటాను. నాన్న, అమ్మ ఇద్దరూ దక్షిణ మధ్య రైల్వేలో ఉద్యోగులు. మేము సికింద్రాబాద్‌లో

ఉండేవాళ్లం. ఎనిమిదేళ్ల వయస్సు నుండి బ్యాడ్మింటన్ ప్రాక్టీసు మొదలుపెట్టాను. నా మొదటి గురువు మహబూబ్ అలీ. ఏడాది తర్వాత గచ్చిబౌలిలోని పుల్లెల గోపిచంద్ అకాడమీలో శిక్షణ తీసుకోవడం ప్రారంభించాను. అప్పుడు నా వయస్సు తొమ్మిది సంవత్సరాలు. ప్రతి రోజూ సుమారు 57 కిలోమీటర్లు ప్రయాణం చేయవల్సొస్తుంది. ప్రాక్టీసు ఆరుగంటలు ఉంటే, అకాడమీకి ప్రయాణం మూడు గంటలు పట్టేది. చాలా విసుగు అనిపించేది. కానీ అవన్నీ నాకు చిన్న విషయాల్లా అనిపించాయి. ఎందుకంటే నాకు ఆట అంటే ఇష్టం. అందుకు ఎంతటి కష్టమైనా ఎదుర్కోటానికి సిద్ధమే. నాలుగేళ్లు గడిచిన తర్వాత మా కుటుంబం గచ్చిబౌలికి మారింది. కారణం నాకోసమే. అప్పటి నుండి వారు రోజూ 57 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సొచ్చేది. ఏందుకంటే వాళ్ల ఆఫీసు అల్వాల్ దగ్గర. వారికీ అది పెద్ద ఇబ్బందిగా అనిపించడం లేదంట. ఎందుకంటే నా కోసం వాళ్లుఎన్ని కష్టాలైనా ఎదుర్కొంటారు. అందులోనే మాకు ఆనందం అంటారు అమ్మానాన్న. ఈ మధ్యనే అమ్మ వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుంది. నా బాగోగులు చూసుకోవటం కోసం.

చదువులో ఫస్ట్‌క్లాస్

ప్రస్తుతం నేను డిగ్రీ బి.కాం మూడవ సంవత్సరం చదువుతున్నాను. ఏంటి రోజుకు ఏడు గంటలు బాడ్మింటన్ అకాడమీలో గడుపుతోంది. మరి కాలేజీకి ఎప్పుడు వెళుతుందని అనుకుంటున్నారా. పదోతరగతి వరకు మాత్రమే రోజూ స్కూల్‌కు వెళ్లేదాన్ని. ఆ తర్వాత ఇంటర్, ఇప్పుడు డిగ్రీ కేవలం పరీక్షలకు మాత్రమే హాజరవుతా. నాకు ఈ అవకాశం కల్పించిన సెయింటాన్స్, మెహదీపట్నం యాజమాన్యానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పాలి. అయితే నేను ఇప్పటి వరకు ఏ పరీక్షలో ఫెయిల్ అవ్వలేదు. అంతే కాదు 60శాతానికి తక్కువ మార్కులు ఎప్పుడూ తెచ్చుకోలేదు కూడా. పరీక్షలకు వారం రోజులుందనగా పుస్తకాలతో కుస్తీ పడతా. అంటే బట్టీ మాత్రం కాదు. అర్థం కాని సబ్జెక్టులను అమ్మనడిగి తెలుసుకుంటా. అమ్మే నాకు ట్యూటర్. కాలేజ్ లైఫ్ మిస్ అవుతున్నానని బెంగైతే అస్సలు లేదు. ఎందుకంటే అకాడమీలో బోలెడంత మంది స్నేహితులు. ఆటే నా ప్రపంచం అయినప్పుడు అందులోనే కదా సరదాలు, సంతోషాలన్నీ...ఉదయం నాలుగు గంటలకు నా రోజు మొదలవుతుంది. మొదట్లో అంటే చిన్నప్పుడు మాత్రం నాన్న నిద్రలేపితే....మళ్లీ పడుకునేదాన్ని. చిరాకు పడేదాన్ని. తర్వాత మాత్రం అలా ఎప్పుడూ ప్రవర్తించలేదు. నాన్న కంటే ముందే నేను నిద్రలేచి ప్రాక్టీసుకు వెళ్లడానికి సిద్ధమయ్యేదాన్ని. ఆదివారం మాత్రం విశ్రాంతి దొరుకుతుంది. ఖాళీ సమయాల్లో సంగీతం వినడం, సినిమాలు చూడటం ఇష్టం.

ఆటలో ఓడితే.....

మా కోచ్ గోపిచంద్ గారు ఎప్పుడూ ఒక మాట చెబుతుంటారు 'ఆటలో ఓడిపోయినప్పుడు నిరుత్సాహపడవద్దు' అని. ఆ రోజు మాత్రమే నీవు వెనుకంజలో ఉన్నావు. ఓటమికి గల కారణాలను అంచనా వేయాలి. ఆలోచించాలి. వాటిని అధిగమించాలి. అప్పుడు తప్పకుండా విజయం సొంతమవుతుందని వెన్నుతట్టి ప్రోత్సహిస్తుంటారు. ఒక టోర్నమెంట్ ఆడిన తర్వాత పది రోజులకు మరో టోర్నమెంట్ ఆడాల్సి ఉంటుంది. ఆ సమయంలో డీలా పడిపోతే తర్వాత ఆట మీద ఆ ప్రభావం ఉంటుంది. సరిగ్గా ఆడలేము అని అంటారు. మా గురువుగారు చెప్పే మాటలు,

సలహాలు ఎప్పటికప్పుడు నాలో కొత్త ఉత్తేజాన్ని నింపుతాయి. నాకు మార్గదర్శకంగా నిలుస్తాయి. ఆటలో రాణించడానికి శక్తినిస్తాయి. ఈ విషయాలు కేవలం క్రీడా రంగంలో వ్యక్తులకు మాత్రమే కాదు, సామన్యులకు సైతం వర్తిస్తాయి. మరోపక్క నాన్న మాత్రం ఎంత ఎత్తు ఎదిగినా ఒదిగుండమని చెబుతుంటారు. నీకు ఎన్నో అవార్డులు రావచ్చు. మరెన్నో టైటిల్స్ గెలవచ్చు...కానీ నీవు సామన్య మనిషివన్న విషయం గుర్తుపెట్టుకోవాలి. గర్వాన్ని ఏమాత్రం దరిచేరనివ్వకూడదు. అది పతనానికి నాంది అని చెబుతుంటారు. మా నాన్న నిజంగా నా హీరో. ఎందుకంటే నేను, అక్క దివ్య ఇద్దరం ఆడపిల్లలమే. నాకు మగపిల్లలు లేరే అనే భావన ఆయనలో మచ్చుకకు కూడా కనిపించదు. నీకు ఇద్దరూ ఆడపిల్లలే అని ఎవరైనా అంటే అస్సలు ఒప్పుకునేవారు కాదు. అక్క కూడా త్రోబాల్, వాలీబాల్ ఆడుతుంది. అయితే ప్రస్తుతం ఆమె డాక్టరు చదువుతోంది. తనకు పెళ్లి అయింది. మా ఇద్దర్నీ అమ్మ, నాన్న ఏ రోజూ ఆడపిల్లలంటే ఇలా ఉండాలి, అలా ఉండాలి అంటూ ఆంక్షల మధ్య పెంచలేదు. ఆడ అయినా మగ అయినా మనం మనుషులం. మనుషుల్లాగే ఉంటాలి అని ఆయన ఉద్దేశం. మా కెరీర్ ఎంచుకోవడంలో కానీ, అక్క పెళ్లి విషయంలో కూడా నాన్న మా అభిప్రాయాలకే ప్రాధాన్యతనిచ్చాడు. గతంలో అంటే ఆడవాళ్లు ఇంటికే పరిమితం కావాలి. ఈ పనులే చేయాలనే ఆంక్షలుండేవి. ఇప్పుడు రోజులు మారాయి. ఆడ, మగ తేడాలేకుండా అందరూ అన్నీ రంగాల్లో రాణిస్తున్నారు. అయితే నేడు చాలా మంది అమ్మాయిలు క్రీడా రంగంలో రాణించలేకపోతున్నారు. వారికి తగిన ప్రోత్సాహం అందించాలి. బ్యాడ్మింటన్‌లో సానియా, సైనా, నేను...క్రికెట్‌లో మిథాలి..ఇలా చాలా మంది కనబడుతున్నారు. ఆ స్ఫూర్తితోనైనా అమ్మాయిలు క్రీడారంగంలోకి రావాలని కోరుకుంటున్నాను.

తల్లిదండ్రులతో....

సాధించిన పతకాలు

- 2009 బ్రాన్స్ మెడల్
- సబ్ జూనియర్స్ ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్
- 2010 సింగిల్ కేటగిరి సిల్వర్ మెడల్
- 2010 జూనియర్ లెవల్ క్వార్టర్ ఫైనల్స్
- 2012 ఆసియా యూత్ అండర్ 19ఛాంపియన్ షిప్
- సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్
- 2013 మలేషియన్ ఓపెన్ టైటిల్
- 2014 కామన్‌వెల్త్ సెమీ ఫైనల్ వరకు
- ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో వరుసగా రెండు కాంస్యాలు
- వరల్డ్ కప్, డెన్మార్క్ సెమీ ఫైనల్ వరకు

అవార్డులు

- అర్జునా అవార్డు
- వేల్స్ యూనివర్సిటీ మద్రాస్ నుండి గౌరవ డాక్టరేట్
- ఎన్‌డి టీవీ ఇండియన్ ఆఫ్ ద ఇయర్ 2014
- ఎఫ్ఐసిసిఐ బ్రేక్‌త్రూ స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్‌ద ఇయర్2014.
- పద్మశ్రీ 2015

నిబ్బరంగా ఉంటా

తొమ్మిదో ఏట నుండి అండర్ 10, 13, 16, 19 లో విజయం సాధించాను. చిన్నప్పుడు అయితే ఓడిపోతే ఏడ్చేదాన్ని. తర్వాత మాత్రం ఓటమి నుండి పాఠాలు నేర్చుకోవటం అలవాటు చేసుకున్నా. చిన్నప్పుడు నా కన్నా సీనియర్స్‌తో ఆడుతున్నప్పుడు గెలిచినా, ఓడినా ఒకటే అనుకునేదాన్ని. ఇప్పుడు నేనూ సీనియర్‌నే. గెలుపు కోసమే కష్టపడుతుంటా. కోర్టులో ఆట రసవత్తరంగా ఉన్న సమయంలో గెలుస్తామో లేదో అన్న కంగారు.... గెలవాలనే తపన...ఓడిపోతామనే భయం ప్రతి ఆటగాడికి సర్వసాధారణం. అంతెందుకు పరీక్షలు రాసిన విద్యార్థికి కూడా ఆ ఫీలింగే ఉంటుంది. సినిమా విడుదలకు ముందు దర్శక, నిర్మాత, హీరోలకు కూడా అలాగే అనిపిస్తుంది. కానీ ఆ సమయంలోనే మన సత్తా ఏమిటో బయటపడుతుంది. నామటుకు నేను మాత్రం ఆ సమయంలో చాలా నిబ్బరంగా ఉంటాను. గెలిస్తే చేసిన కృషికి ఫలితం దక్కింది అని అనుకుంటా. లేకపోతే నా లోపాలను తెలుసుకుంటా. అంతే కాని కృంగిపోవడం మాత్రం ఉండదు. ఎందుకంటే కేవలం ఎలాంటి ప్రయత్నం చేయకుండా ఓడిపోయిన వారు మాత్రమే బాధపడాలి. ఎందుకంటే కష్ట పడకుండా విజయం సాధించాలనకున్నందుకు. ఇవన్నీ నా ఆట నాకు నేర్పిన పాఠాలు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలో సెమీఫైనల్స్ వరకు వెళ్లాను. దురదృష్టం ఓడిపోయాను. కానీ నిరుత్సాహపడలేదు. ఆ సమయంలో ఎలా ఆడుంటే బాగుండేదన. లోపాలేమిటి అనే సింహావలోకనం చేసుకున్నాను. ముందుకు నడిచాను.. 2012 ఆసియా జూనియర్ ఛాంపియన్‌లో బంగారు పతకం సాధించాను. 2013అంతర్జాతీయ ఛాంపియన్ షిప్‌లో రెండు సార్లు వరుసగా కాంస్య పతకాలు వచ్చాయి. బ్రాన్స్ మెడల్ దక్కింది. రెండు సంవత్సరాల క్రితం అర్జునా అవార్డు వరించింది. 2014కామన్‌వెల్త్‌లో కాంస్య పతకాన్ని పొందాను. మద్రాస్ యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేటు అందించారు. ఇప్పుడు పద్మశ్రీ ప్రకటించడం చాలా ఆనందంగా ఉంది. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు ఈ అవార్డులు ఒక ప్రోత్సాహం లాంటిది అని నా ఫీలింగ్. మొదట పద్మశ్రీ వచ్చింది అంటే నమ్మలేదు. ఏదో సరదాకి చెబుతున్నారు అనుకున్నాం. తర్వాత అది నిజమని తెలిసాక మా ఇంట్లో వారి ఆనందానికి అవధుల్లేవు. గోపిచంద్‌గారు అయితే సింధు ఇలాంటి అవార్డులు ఇంకా మరెన్నో సాధించాలి అని దీవించారు. ఈ ఏడాది ఒలంపిక్ ఇయర్ కదా! కొంచెం ఎక్కువ కష్టపడుతున్నాను. త్వరలో స్విస్, మలేషియా వంటి ముఖ్యమైన టోర్నమెంట్స్‌లో ఆడేందుకు సిద్ధమవుతున్నాను. ప్రస్తుతం వరల్డ్ బ్యాడ్మింటన్ ర్యాకింగ్‌లో టాప్ టెన్ స్థానాల్లోపలే ఉన్నాను. మొదటి స్థానం సంపాదించడమే నా జీవిత లక్ష్యం. అంతేకాదు వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో కూడా మొదటి స్థానం సంపాదించాలి. అందుకోసం ప్రయత్నిస్తాను. గత మూడేళ్ల నుండి ఓజిక్యూ సంస్థ నాకు స్పాన్సర్ చేస్తోంది. వారు అందిస్తున్న సహకారం మరువలేనిది. బ్యాడ్మింటన్ ఆట అనేది నా ఫ్యాషన్. ఆట లో ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తాను. నా జీవితంలో బ్యాడ్మింటన్ ఆట తర్వాతే మరేదైనా...

ఇంటర్వ్యూ : **కారుసాల అనిత**



మాలకు మూడు పదుల వయసు వుంటుందేమో! తన ఇద్దరు పిల్లలను దగ్గరకు తీసుకుని ముద్దులిచ్చి స్కూలుకు సాగనంపడమంటే ఆమెకు మహా ఇష్టం. అంతటితో సరిపుచ్చుకోకుండా... వారు కనిపించినంతసేపు అలా చూస్తూ చెయ్యి ఊపుతూనే వుంటుంది. కిలోమీటరు దూరంలో వున్న పాఠశాలకు మట్టి రోడ్డుమీద నడిచి వెళ్తున్న చిన్నారులను మురిపెంగా చూసుకోవడంలో తెలీని ఆనందాన్ని పొందుతుంటుంది. నిజానికి రోజంతా పడ్డ కష్టాన్ని మర్చిపోవడానికి ఆ ఒక్కక్షణం చాలు. హెచ్.ఐ.వితో సహజీవనం చేసే ఆమె జీవితంలో ఎన్ని ఒడిదొడుకులో. అయితే వాటన్నింటిని తట్టుకుని నిలబడి కుటుంబాన్ని పోషిస్తున్న తీరు ఎవరినైనా అబ్బురపరచక మానదు. పిల్లలు బడికి వెళ్లాక మాల కూడా ఒక చిన్న బాక్సులో అన్నం, కొద్దిగా పచ్చడి సర్దుకుని పనికి బయల్దేరుతుంది. ఇప్పుడంటే ఆమె మొహంలో చిరునవ్వు కనిపిస్తోంది కానీ... తొమ్మిదేళ్ల కిందట ఆమె చుట్టూ చీకటే. విషాదమే.

కష్టాలతో సావాసం కన్నీళ్లతో పోరాటం

హుబ్లి – ధర్వాడ్ జిల్లాలో ఓ చిన్న గ్రామం మాల–మహేష్ దంపతులది. వ్యవసాయదారు కుటుంబం కావడంతో ఒక స్థిరమైన ఆదాయం వుండేది కాదతనికి. ఆ కొద్దిపాటి ఆదాయంతోనే రోజులు నెట్టుకొచ్చేవారు. ఓరోజు మహేష్ తీవ్రమైన జ్వరంతో ఇంటికి చేరుకున్నాడు. వారం రోజులు గడిచినా... తగ్గకపోగా... అంతకంతకు పెరిగింది. పైగా శ్వాస తీసుకోవడం కూడా కష్టంగా తయారైంది. దాంతో ఇరుగు పొరుగు దగ్గర చేబదులు తీసుకుని ఆటో రిక్షాలో అతన్ని ఆసుపత్రికి తీసుకెళ్లింది. వైద్యులు పరీక్షలు చేసి... అతనికి ఎయిడ్స్ వుందని చెప్పారు. దాంతో మాలకు నోట మాట రాలేదు. ప్రపంచం అంతం అయిపోయినట్టనిపించింది. అతనికి ఆ జబ్బు వుందంటే తనకి కూడా వచ్చే వుంటుందని చిగురుటాకులా వణికిపోయింది. పరీక్షలు చేయించుకుంటే హెచ్ఐవి పాజిటివ్ అని చెప్పారు డాక్టర్లు. ఈలోగా మహేష్ ఆరోగ్యం అంతకంతకు క్షీణించి...మాలను, పిల్లలను ఒంటరివాళ్లను చేసేసి వెళ్లిపోయాడు. ఆ మహమ్మారి జబ్బు తనకుందని తెలిస్తే... పల్లెటూళ్లో తనను, తన పిల్లలను వుండనిస్తారో లేదోనని భయపడిపోయింది. ఒకవేళ తను కూడా ఆ జబ్బుతో చనిపోతే పిల్లల సంగతేంటని మదనపడింది. పైగా ఇంటిల్లపాదికి ఇంత అన్నం పెట్టే వాడే పోవడంతో ఆమెకు ఏం చెయ్యాలో తోచలా. అలా శూన్యంలోకి చూస్తూ గడిపేది. ఆకలిని తను మర్చిపోయినా పిల్లల వల్ల కాదు కదా. అమాయకంగా, దీనంగా చూస్తున్న వారికి తనే ఇంత అన్నం పెట్టాలని నిర్ణయించుకుంది. ఓసారి ఊళ్లో మహిళలకు ఎంబ్రాయిడరీ పని నేర్పడానికి వచ్చిన దేవకి గుర్తొచ్చిందామెకు. ఆమె అయితే తనను తప్పకుండా ఆదుకుంటుందన్న ఆశ కలిగింది. వెంటనే తన బ్యాగ్గు మొత్తం వెతికి దేవకి విజిటింగ్ కార్డు బయటికి తీసింది. అప్పటికే చాలా చీకటి పడిపోయింది. అయినప్పటికి వెంటనే ఆమెకు ఫోన్ చెయ్యాలని నిశ్చయించుకుంది. తన గాథంతా వివరించి ఆఖరుకు... "మీరు సాయం చేయకపోతే ...చావడమొక్కటే మిగిలింది మేడమ్. నన్ను నా పిల్లలను కాపాడండి..." అంటూ ఆమెను ప్రాధేయపడింది ఫోన్లోనే.

హృదయాన్ని కలచివేసే మాల గాథ విన్నాక ... దేవకి ఆలోచనలో పడింది. దిక్కూమొక్కూ లేక...బతికే మార్గంలేక...విలవిల్లాడే ఒంటరి మహిళలెందరో వున్నారా చుట్టుపక్కల గ్రామాల్లో వారికి ఉపయోగపడేలా ఏదో ఒకటి చేయాలనుకుందామె. గార్మెంట్స్ కంపెనీ ప్రారంభిస్తే ఎలా వుంటుందన్న ఆలోచన అప్పుడే వచ్చిందామెకు. వెంటనే పరిశ్రమల శాఖా మంత్రిత్వ అధికారులను కలిసి సాయం కోరింది. వారు కూడా సానుకూలంగా స్పందించడంతో 'దేవ్ ఎక్స్‌పోర్ట్ గార్మెంట్స్ అండ్ అప్పారెల్స్' ప్రారంభించింది. వందలాది మంది మహిళలు ఆ కంపెనీలో చేరారు. వారిలో మాయ ఒకటి. స్థానిక మహిళలను సమీకరించడం...వారికి ఎంబ్రాయిడరీలో, కుట్టుపనిలో శిక్షణ ఇప్పించడం ఆమె పని. ఆనక వారిని కంపెనీ పనుల్లోకి తీసుకుంటారు.

మాయ ఆరోగ్యం పట్ల కూడా దేవకి శ్రద్ధ తీసుకుంది. వైద్య పరీక్షలు చేయించగా మాల చెప్పినదే మరోసారి వైద్యుల నోటెంట కూడా వినాల్సి వచ్చింది. కాకపోతే వ్యాధి తీవ్రత అంతగా లేదన్నదే వారికి స్వాంతన కలిగించిన విషయం. మందులు క్రమం తప్పకుండా వాడుకుంటూ... గార్మెంట్స్ కంపెనీలో పనిచేసుకుంటూ ... పిల్లల్ని చదివించుకుంటూ... కూసింత సేద తీరుతోంది మాల. క్షణం తీరిక లేని జీవితం అయితేనేం... ఎంతో సంతోషంగా ఆస్వాదిస్తోంది. ✦

అతను చూడ్డానికి చాలా సాదా సీదాగా కనిపిస్తాడు. అంత చురుకైనవాడిలా కూడా అగుపించడు. ఓ కుర్రాడు అడిగిన ప్రశ్న అతడిలో ఆలోచనలు రేపింది. అలాంటి యువత కోసం తనకు చేతనైంది చేయాలనుకున్నాడు. అందుకోసం సొంత ఇంటిని అమ్మేశాడు. బెంగుళూరులో చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేశాడు. ఎలాంటి సౌకర్యాలు లేని పల్లెటూరు చేరుకున్నాడు. ఇదంతా చూసిన కుటుంబీకులు అతనికి పిచ్చి పట్టిందన్నారు. ఇవాళ వారి అభిప్రాయం మారిపోయింది. కారణం! అతను స్థాపించిన కాలేజీ ... అది సాధిస్తున్న విజయాలు!! కళ్లారా చూశాక... అతన్ని అభినందించని వారు లేరు.

కాలేజీ కోసం ఇల్లు అమ్మేశాడు

ప్రాంజల్ దుబే! పుట్టి పెరిగింది మధ్యప్రదేశ్‌లోని ఓ కుగ్రామంలో. ఉద్యోగం మాత్రం బెంగుళూరులో. మంచి జీతం అందేది. అలాంటిది ఓరోజు హఠాత్తుగా ఉద్యోగం మానేశానని చెప్పడంతో ఇంట్లో అంతా అవాక్కయ్యారు. వెర్రివెంగళప్పను చూసినట్టు చూశారతన్ని. అంత మంచి ఉద్యోగాన్ని వదులుకుంటానన్నాడూ అంటే బలమైన కారణం వుండే వుంటుంది కదా.

ఆలోచింపచేసిన ప్రశ్న

ఓసారి స్వగ్రామం వెళ్లాడు దుబే. అక్కడో యువకుడు తనకు ఉద్యోగం చేయాలనుందని, ఏదైనా సలహా ఇమ్మని అడిగాడు. డిగ్రీ వుంటే ఉద్యోగం వస్తుందని చెప్పాడు దుబే. ఆ పల్లెటూరి

ప్రాంజల్ దుబే

అబ్బాయి తమకున్న కొద్దిపాటి ఆస్తీ అమ్మేసి డిగ్రీ చదువుకున్నాడు. తీరా ఎంత ప్రయత్నించినా ఉద్యోగం మాత్రం సంపాదించుకోలేకపోయాడు. ఎకాఎకిన దూబే దగ్గరకెళ్లి చెడా మడా తిట్టేశాడు. అతనిచ్చిన సలహా వల్లే వున్న ఆస్తినీ పోగొట్టుకున్నాననీ, ఉద్యోగమూ రాలేదనీ వాపోయాడు. అతను తిట్టాడని కాదు కానీ ఈ ఘటన దూబేలో ఆలోచనలు రేపింది. గ్రామీణ యువత ఉద్యోగం సంపాదించుకోడానికి ఆటంకాలేంటనేదాని మీద లోతైన అధ్యయనమే చేశాడు.

డిగ్రీ పట్టా చేతిలో వున్నప్పటికీ ఉద్యోగం చేయడానికి కావాల్సిన సాంకేతిక నైపుణ్యం, భాషా పరిజ్ఞానం వారికి లేకపోవడమేనని తెలుసుకున్నాడు. వెంటనే ఆ పల్లెటూళ్లో ఒక కాలేజీ పెట్టాలనుకున్నాడు. 2010లో ధర్మశాలలో ఒక చిన్న గదిని అద్దెకు తీసుకుని కాలేజీ ప్రారంభించేశాడు. మెల్లగా తన సొంత ఇంటిని అమ్మేసి వచ్చిన డబ్బుతో కొద్దిగా భూమి కొనుగోలు చేసి కాలేజీ కట్టాడు. నామ మాత్రపు ఫీజులతో రకరకాల కోర్సులు నేర్పించసాగాడు. అందుకు తగ్గ ఉపాధ్యాయులనూ ఏర్పాటు చేశాడు. పేరుగాంచిన కాలేజీల నుంచి ఉపాధ్యాయులను పిలిపించి పాఠాలు చెప్పించసాగాడు. ముందుగా తమ కాలేజీకి వచ్చిన విద్యార్థుల ఆసక్తులను శక్తులను తెలుసుకునేవాడు. వారు ఏ కోర్సులను చదివితే ఉపయోగకరంగా వుంటుందో సూచించేవాడు. సంబంధిత కోర్సుతో పాటు భాషా పరిజ్ఞానం కూడా వారికి నేర్పుతారక్కడ. బిబిఎ, బికామ్, బిసిఎ, మైక్రో బయాలజీ వంటి గ్రూపులను అక్కడ చదువుకునే అవకాశముంది. పైగా బెంగుళూరు, ఇండోర్‌లోని ప్రసిద్ధ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పిస్తారు. వ్యవసాయం పట్ల ఆసక్తి వున్న వారు సేంద్రీయ వ్యవసాయంలో శిక్షణ ఇస్తారు. నూతన పద్ధతుల్లో సేద్యం చేయడం నేర్పుతారు. జీవితంలో ఒక్కసారి కూడా లిఫ్టు చూసి ఎరగని యువత ఇప్పుడక్కడ చదువుకుని... విప్రో, ఫ్యూచర్ గ్రూప్, శాప్, వంటి కార్పొరేట్ కంపెనీల్లో పాతికవేలు, ముప్పైవేల రూపాయల ఉద్యోగాలు చేసుకుంటూ మంచి స్థానంలో వున్నారు. ఇళ్లలోంచి బయటకు పంపడానికి ఇష్టపడని గ్రామీణులు సైతం తమ ఆడపిల్లలను దూబే కాలేజీకి పంపిస్తున్నారు. ఉద్యోగాలు చేసుకోవడానికి సంతోషంగా అంగీకరిస్తున్నారు. దూబే కోరుకుంది కూడా ఆ మార్పే.

✦



ఇంకా వసంత రుతువు ప్రకృతి వాకిట అడుగిడనేలేదు ...అప్పుడే గ్రీష్మం వెచ్చటి ఆవిర్లను వెళ్లగక్కుతోంది. ఇక వేసవి మొదలైతే ఉదయభానుడి ఉగ్రరూపం ఇంకెంత భయంకరంగా ఉంటుందోనని ఈ పాటికే చాలా మంది గుండెల్లో బెంగకూడా మొదలై ఉంటుంది. వడగాల్పులు, వెచ్చటి ఆవిర్లు, రోజు రోజుకి పైకి ఎగబాకే ఉష్ణోగ్రతలు.... ఉక్కపోత, దానికి తగ్గట్టు కరెంటు కోతలు...అన్నీ వెరసి ఎండాకాలం... కాదు, మనపాలిట గడ్డుకాలం గడిచేదెలానో అనే చింత తలపకామానదు. మరేం ఫర్వాలేదు ఈ వేసవిని చల్ల చల్లగా గడిపేందుకు ఏదైనా విహారయాత్రకు వెళితే...అబ్బ ఇక ఎండ బాధల నుండి ఉపశమనం లభించినట్టే... రోజు వారీ ఒత్తిళ్ల నుండి కాస్త సేద తీరినట్టే. పిల్లలకైతే బడి సెలవులు. ఇంకేం పెద్దలు కాస్త తీరిక చేసుకుంటే సరి...సకుటుంబ సపరివార సమేతానికి స్వాగతం పలికే వేసవి విడిదిళ్లు కావల్సినన్ని. అయితే ఏ ప్రదేశం వెళితే హాయిగా గడపచ్చు. ఆ ప్రాంత ప్రత్యేకతలేంటి అన్న విషయాలు ముందే తెలిస్తే...ఇక ఆ టూర్‌లో మరపురాని మజిలీలన్నీ మన సొంతమైనట్టే. ఇంకెందుకు ఆలస్యం ఆ వివరాలన్నీ ఇవాళ్టి అట్టమీది కథలో తెలుసుకుందాం!

వేసవిలో చల్ల చల్లగా....

ఊటి వెళ్లాలా...కొడైకెనాల్ పోవాలా...“మా ఆఫీసులో అకౌంటెంట్ సుబ్రహ్మణ్యం గత ఏడాది వేసవి విహారయాత్రకు కాశ్మీర్ వెళ్లాడు. అక్కడ ప్రకృతి చాలా రమణీయంగా ఉంటుందని” చెప్పాడు. మధ్యలోనే భర్త మాటలకు అడ్డొచ్చిన భార్య “అదేం కాదండీ...మన వీధి చివరినున్న మహాలక్ష్మిగారి కుటుంబమంతా కేరళ వెళ్లొచ్చారు. రబ్బరు తోటలు, ఇళ్లమధ్య ప్రవహించే కాలువలు...పడవ ప్రయాణం భలే ఉంటుంది. ఇంకా ఆ చుట్టు పక్కల చాలా ఊర్లను కూడా చూడచ్చు . అక్కడ వాతావరణం చల్లగా ఉంటుంది. పిల్లలు, పెద్దలు అందరూ సరదాగా గడపచ్చు అని చెప్పింది. ఈ మాటలు వింటున్న చింటు గాడు మాత్రం ఊరుకుంటాడా. “లేదు అమ్మా...సమ్మర్‌లో సిమ్లా చాలా బాగుంటుంది. అక్కడ వాటర్ ఫాల్స్,...చూడదగ్గ ప్రదేశాలు చాలానే ఉన్నాయి. ఊ.... మనం సిమ్లానే వెళదామని మారం చేయడం మొదలుపెడతాడు. వేసవి విహారానికి వెళదామనుకుంటున్న చిన్న కుటుంబంలో ఎదురయ్యే చింతలే ఇవన్నీ. రకరకాల ప్రదేశాలు...ఏ ప్రదేశం ప్రత్యేకత దానిదే. కానీ అన్నీ సందర్శనీయ ప్రదేశాలే. మరి ఎక్కడకెళ్లాలో నిర్ణయించుకోవడం ఎలా? దానికి ఓ మార్గం ఉందండోయ్. ఏముంది మనం వెళ్లాలనుకుంటున్న ప్రాంతం, మనం నివశిస్తున్న ప్రదేశానికి ఎంత దూరంలో ఉంది? మనకున్న సెలవులు ఎన్ని రోజులు? అన్నింటికన్నా ముఖ్యమైనది, ముందే ఆలోచించుకోవాల్సింది... అదేనండీ బడ్జెట్ కేటాయింపులు. ఈ ప్రణాళికలన్నీ తయారుచేసుకుంటే ఇక సులువుగా విహారయాత్ర మార్గం సుగమం అవుతుంది. అయితే ప్రయాణంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సరి ఇక ఎండా కాలం ఆహ్లాదంగా గడిచినట్టే. దానికి తోడు కాస్త ప్రకృతి అందాలను, విచిత్రాలను, వింతలను తనివితీరా ఆస్వాదించగల సౌందర్యారాధకులకైతే ఇక కన్నుల పండుగే. జలపాతాలు...ఎత్తైన కొండలు...కనుచూపు మేరలో ఏటు చూసినా పచ్చని చీరతో అలంకరించినట్టుండే నేల. రంగురంగుల పూల చెట్లు ... ఆ అందాలు..ఆనందాలు వర్ణించడానికి మాటలు చాలవు.

కొండల రారాణి ఊటీ

తమిళనాడు రాష్ట్రంలోని నీలగిరి పర్వతాలపై కొలువుదీరిన ప్రసిద్ధ పర్యాటక ప్రదేశం “ఊటీ”. దీన్నే ఉదర మండలం అని కూడా అంటారు. సుముద్ర మట్టానికి 2,240 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ ప్రదేశం అన్నివేళలా చల్లగా ఉంటుంది. వేసవి విహారయాత్రకు అనువైన ప్రదేశం. అందుకే ఇక్కడ సేద తీరేందుకు దేశ విదేశాలనుండి వచ్చే పర్యాటకుల సంఖ్య

తక్కువేమీ కాదు. ఇక్కడ అందమైన లోయలు...ఎత్తైన పర్వతాలు చూస్తుంటే మనసు ఉరుకులు పెట్టక మానదు. ఈ నీలగిరి పర్వత లోయల్లో పుష్కరకాలానికొకసారి కురుంజి పూలు పూస్తాయి. అవి నీలి రంగులో ఉంటాయి. అప్పుడు ఈ ప్రదేశమంతా నీలిరంగు వస్త్రంతో ముస్తాబైన కొత్త పెళ్లికూతురిలా ఉంటుంది. ఊటీని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడంలో బ్రిటీష్ పాలకుల పాత్రే ఎక్కువ. కారణం దక్షిణ భారతంలోని ఇతర ప్రాంతాల్లో వేడి, తేమను వారు ఎక్కువగా తట్టుకోలేరు. దాంతో వారంతా వారాంతరాల్లో ఊటీ వచ్చి గడిపేవారు. అందుకే దీన్ని "హిల్ స్టేషన్ రాణి" అని అన్నారు దొరలు. ఈ ప్రాంతంలో సారవంతమైన నేల ఉండటంతో ఇక్కడి ప్రజలు ఎక్కువగా తేయాకు, కాఫీ తోటలు, సుగంధ ద్రవ్యాలు వంటి పంటలను పండిస్తారు.

ఊటీలో చూడదగ్గ ప్రదేశాల్లో బొటానికల్ గార్డెన్, దోడబెట్ట శిఖరం, ఊటీ సరస్సు, కల్హట్టి జలపాతం ముఖ్యమైనవి. ప్రత్యేకంగా మకర పండుగ సందర్భంగా ఫ్లవర్ షో నిర్వహిస్తారు. ఈ వేడుకలో రకరకాల

పూలతో చక్కగా అలంకరించి, చూపరుల మనస్సు దోచిన వారికి బహుమతి అందచేస్తారు. చుట్టుపక్క గ్రామలనుండి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి సంతోషంగా ఈ పోటీలో పాల్గొంటారు. ఎప్పుడూ చూడని రకరకాల పూలని ఆ సమయంలో చూడవచ్చు అన్న మాట.

విజయవాడ నుండి ఊటీకి సుమారు 950 కిలోమీటర్లు ఉంటుంది. అక్కడికి చేరుకోవడానికి సులువైన రోడ్డు, రైలు మార్గాలున్నాయి. విమానంలో వెళ్లాలనుకుంటే కోయంబత్తూర్ వరకు వెళ్లి అక్కడి నుండి ఊటీ చేరుకోవచ్చు.

ఇక్కడ పర్యాటకులకు ఆతిథ్యమివ్వడానికి నక్షత్రాల హోటల్స్ దగ్గర నుండి డార్మెటరీల వరకూ వసతి సదుపాయాలు ఉన్నాయి. సామాన్య తరగతి హోటల్స్ ధర రోజుకు సుమారు వెయ్యి నుండి పదిహేను వందల మధ్య ఉంటుంది.

ఆహ్లాదానికి చిరునామా మున్నార్

పచ్చటి ప్రదేశాలు, కొబ్బరి తోటలు, బ్యాక్ వాటర్‌లో బోటు ప్రయాణాలు, కొండలు, వాగులు, ఆయుర్వేద సుగంధాల మూలికలు....వెరసి చూడ చక్కని ప్రదేశం కేరళ. అక్కడికి దగ్గర్లోనే ఇడుక్కి జిల్లాలో గల మున్నార్ వేసవి యాత్రకు నిండైన ప్రదేశం. పటమటి కనుమలతో ఈ ప్రాంతమంతా కొండలతో చుట్టి ఉంటుంది. మున్నార్ అంటే

విహార యాత్ర విజయవంతం కావాలంటే...

కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు కొంచెం జాగ్రత్తగా వ్యవహరించడం సహజం. కానీ వేసవి విహారానికి ఎత్తైన కొండలు, పర్వత ప్రాంతాలు, శిఖరాలు చల్లని ప్రదేశాలకు వెళుతున్నప్పుడు ఇంకా మరికొన్ని ఎక్కువ జాగ్రత్తలు పాటించడం అవసరం. అది పిల్లలైనా, పెద్దలైనా, యువతైనా. చాలా మందికి బస్సు ప్రయాణం పడదు. అలాంటి వారు రైలు ప్రయాణాన్ని ఎంచుకోవడం ఉత్తమం. అంతేకాకుండా ఎత్తైన కొండల్లో, ఘాట్ రోడ్డులో ప్రయాణించేప్పుడు మరి కొంత మందికి తల తిరగడం, కడుపులో వికారం, వాంతులు వంటి సమస్యలు తలెత్తుతాయి. అలాంటి వారు ముందుగానే మానసికంగా నాకేమీ కాదు అనే ధైర్యంతో ఉండాలి. వారి పక్కనున్న వారు ఎప్పటికప్పుడు వారి పరిస్థితిని గమనిస్తూ ఉండాలి. ఇంకొకటి చాలా మంది బయట ప్రదేశాలకు వెళ్లినప్పుడు అక్కడ ఆహారపదార్థాలు, నీళ్లు సరిపడకపోవచ్చు. ఆ విషయంలో కొంచెం ముందు చూపుతో వ్యవహరించడం మంచిది. ఎక్కడిపడితే అక్కడ నీరు తాగకుండా ఫిల్టర్ చేసిన నీళ్లనే తాగడం ఉత్తమం. కొబ్బరి నీళ్లు, పండ్లు వంటి ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం మంచిది. బయట దొరికే నూనె, ప్యాకెట్ పదార్థాలను సాధ్యమైనంత వరకూ తక్కువగా తీసుకోవాలి. ముఖ్యంగా కుర్రాళ్లు కొండలు, పర్వత ప్రాంతాలు, జలపాతాల దగ్గర తప్పని సరిగా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయి. స్నేహితులు, కుటుంబ సభ్యులు ఎవరైనా సరే కలిసి వెళ్లినవారందరూ ఒకరినొకరు గమనించుకుంటూ ఇంకా మిగతా పర్యాటకులను పరిచయం చేసుకొని వారి సలహాలు, సూచనలతో సందర్శనీయ ప్రదేశాలను చూడటం మేలు. అక్కడ ప్రకృతి రమణీయతను ఆస్వాదించేందుకు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలి. లేని పక్షంలో చిరాకు, చిర్రుబుర్రులతో విహార యాత్ర అసంతృప్తినే మిగుల్చుతుంది. వన్య ప్రాణులు, అక్కడ కొన్ని ప్రదేశాల్లో పర్యాటక శాఖ వారు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను తప్పనిసరిగా గమనించాలి. ఆ ప్రాంతపు నియమ నిబంధనలను పాటించాలి

మూడు నదుల కలయిక అని అర్థం. ఇక్కడ ఆహ్లాదకరమైన వాతావరణంతోపాటు, అందమైన కొండలతో వేసవి విడిదికి అనువైన ప్రదేశం మున్నార్. దట్టమైన అడవులు, తేయాకు తోటలు, అందమైన లోయలు, మెలికలు తిరిగే పర్వత ప్రాంతాలు, అరుదుగా కనిపించే మొక్కలు, జంతువులు, వన్య సంరక్షణాలయాలు ఇలాంటివి ఎన్నో ఇక్కడ ప్రకృతిలో ప్రత్యేకం. ట్రెక్కింగ్, బైకింగ్, బర్డ్ వాచింగ్‌కు అనువైన స్థలం మున్నార్.

అంతేకాదు...ఆస్కార్ అవార్డు పొందిన "లైఫ్ ఆఫ్ పై" చిత్రం షూటింగ్ కూడా ఇక్కడ జరగడం విశేషం. ఎరావికులం నేషనల్ పార్కు ఇక్కడ తప్పకుండా చూడాల్సిన వాటిల్లో ఒకటి. దక్షిణ భారతదేశంలోనే 2700 మీటర్ల ఎత్తైన కొండ అనముడి శిఖరం ఈ పార్కులోనే ఉంది. పల్లివాసల్, చిన్న కనాల్‌అనే రెండు జలపాతాలు పర్యాటకులకు వీనుల విందు కలిగిస్తాయి. తేయాకుకు సంబంధించి టాటా సంస్థ నిర్వహిస్తున్న మ్యూజియం కూడా తప్పక వీక్షించదగ్గదే. ఇక్కడకు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో అట్టుకాల్ ప్రదేశం ఆకర్షించే జలపాతాలకు నిలయం. ఇక్కడి జలపాతాలు నుండి వచ్చే హోరుమనే శబ్దం మైళ్ళ దూరం వినబడుతుంది. రైలు మార్గం ద్వారా మున్నార్ చేరుకోవాలంటే ఎర్నాకులం నుండి 130 కిలోమీటర్లు, మధురై నుండి 135 కిలోమీటర్ల దూరం ఉంటుంది. తమిళనాడు, కేరళ నుండి బస్సు సౌకర్యాలున్నాయి. పైసలుండాలే కానీ అతిథి సత్కారాలు చేయడానికి బోలెడన్ని రిసార్టులు, హోటల్స్ చాలానే ఉన్నాయి.

సుందరమైన ప్రదేశం కొడైకెనాల్

పశ్చిమ కనుమల్లోని పళని కొండల్లో దాగిఉన్న అందమైన హిల్స్ స్టేషన్ కొడైకెనాల్. ఇది తమిళనాడులోని దిండుగల్ జిల్లాలో ఉంది. సముద్ర మట్టానికి 2133 మీటర్ల ఎత్తులో ఒక పీఠభూమిపై ఉండటం వల్ల ఈ పట్టణం అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణానికి నిలయమైంది. పర్యాటకులకు సుమనోహరమైన జ్ఞాపకాలను మిగిల్చే ప్రాంతంగా బాసిల్లుతోంది. కొడైకెనాల్ పట్టణం పరప్పర్, గుండర్ లోయల మధ్యలో ఉంది. తమిళంలో కొడైకెనాల్ అంటే అడవుల బహుమతి అని అర్థం. అంతేకాదు దీన్ని వేసవి అడవి అనికూడా అంటారు. ఇక్కడ ప్రకృతి, జలపాతాలు, పర్వతాలు, లోయలు, రాళ్ల పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేస్తాయి. ఇక్కడ ఎక్కువగా రేగు, బేరి పండ్ల సాగు చేస్తారు. ఇంట్లో చాక్లెట్లు చేసి దుకాణాల్లో అమ్మే పద్ధతి



ఇక్కడ ప్రత్యేకం. గ్రీన్ వ్యాలీ వ్యూ, బేర్‌షోల జలపాతాలు, సరస్సు, మ్యూజియం, సైన్స్ అబ్జరవేటరీ, పిల్లర్ రాక్స్, గుణ కేవ్స్ ఇక్కడ తప్పకుండా చూడవల్సిన ప్రదేశాలు. ఏడాది పొడవునా ఇక్కడి ప్రకృతి పర్యాటకులను సమ్మోహితుల్ని చేస్తుంది. వేసవి విడిదికి ఇది చక్కని చిరునామా. పర్వతవరోహణ, గుర్రపుస్వారీ, బోటింగ్ వంటి సాహసకృత్యాలు సైతం ఇక్కడ చేసే వీలుంటుంది. ఈ ప్రాంతం మధురైకి సుమారు 120 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. బెంగళూరు,

మద్రాసు నుండి కూడా ఈ ప్రదేశానికి రైలు, రోడ్డు మార్గాల ద్వారా చేరుకోవచ్చు.

వేసవి రాజధాని సిమ్లా

వేసవి విడిదికి స్వాగతం పలికే అత్యంత ముఖ్యమైన ప్రదేశాల్లో సిమ్లా ప్రముఖమైనది. ఇది హిమాచల్ ప్రదేశ్ రాజధాని కూడా. ఈ ప్రాంతం సముద్ర మట్టానికి 2202 మీటర్ల ఎత్తున ఉంది. అందుకే అతి చల్లనైన వాతావరణం ఇక్కడ సొంతం. 1864 సంవత్సరంలోనే బ్రిటీష్ పాలకులు సిమ్లాని వేసవి రాజధానిగా ప్రకటించారు. జఖు, అబ్జర్వేటరీ, సమ్మర్ వంటి ప్రధాన కొండలు ఇక్కడ కొలువుదీరాయి. లక్కర్ బజార్, స్కాండల్ పాయింట్‌లోగల పర్వత శ్రేణులు పర్యాటకులను మరింత ఉత్సాహభరితుల్ని చేస్తాయి. మాల్, లోయర్ బజార్, లక్కర్ బజార్‌లలో జరిగే షాపింగ్ సందర్శకులను మరింత ఆకట్టుకుంటుంది. అంతేకాదు భారతదేశంలోనే ఐస్ స్కేటింగ్ రింక్‌కు సిమ్లా ప్రసిద్ధి. ఈ గ్రౌండ్ మంచుతో కప్పబడి ఉంటుంది. ఫిబ్రవరి నెలలో ఈ ప్రకృతి సౌందర్యాన్ని మరింత ఆస్వాదించవచ్చు. ఇక్కడ మరింత ఆనందానికి పురికొల్పే విషయమేమంటే రాఫ్టింగ్. బాస్, రావి, చీనాబ్, జీలం నదుల్లో రాఫ్టింగ్ చేస్తారు. వేసవి, వసంత కాలంలో ఇక్కడ మంచు అధికంగా పడుతుంటుంది కావున ఆ కాలంలో రాఫ్టింగ్‌కు అనువుగా కూడా ఉంటుంది. ఇక పోతే ఆంధ్రప్రదేశ్ రాజధాని విజయవాడ నుండి సిమ్లా చేరుకోవడానికి సుమారు 33 గంటల సమయం పడుతుంది. దేశ రాజధాని ఢిల్లీ నుండి సిమ్లాకు బస్సుసౌకర్యం ఉంది. అయితే సిమ్లా ప్రయాణం కొంచెం ఖర్చుతో కూడుకున్న విషయమే.

అద్భుతాల గుట్ట మౌంట్ అబు

రాజస్థాన్‌లోని సిరోహి జిల్లాలో మౌంట్ అబు అత్యంత ప్రాముఖ్యమైన వేసవి విహారానికి అనువైన ప్రదేశం. పచ్చటి కొండలు, దివ్యమైన సరస్సులు, సౌకర్యవంతమైన వాతావరణం అన్నీ కలిసి కేరాఫ్ అడ్రస్ మౌంట్ అబు. ఇక్కడ ధార్మిక కేంద్రాలు ఎక్కువే. 1220 మీటర్ల ఎత్తులో గల ఈ పర్వత కేంద్రం ఆరావళి పర్వత శ్రేణుల్లోని ఎత్తైన శిఖరం పైన నెలకొని ఉంది. వేసవికాలం, వర్షాకాలంలో ఈ ప్రాంతానికి పర్యాటకుల తాకిడి ఎక్కువే. కారణం ఇక్కడ వాతావరణం అనుకూలంగా ఉండటం. చూడదగ్గ ప్రదేశాలు నక్కి సరస్సు, సన్సెట్ పాయింట్, దిసిటీ ఆఫ్ అబూ రోడ్, ది

గురు శిఖర్ పీక్, టోడ్ రాక్, వన్యప్రాణి అభయారణ్యం. నక్కిలేక్‌కు ఆగ్నేయ దిక్కున గల సూర్యాస్తమయం ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ. అందమైన కొండల మధ్య సూర్యుడు సాయంత్రం వేళ అస్తమించే దృశ్యం చూసేందుకు రెండు కళ్లు చాలవు. నక్కీ సరస్సు కూడా సందర్శకులకు చక్కటి ఆనందాన్ని కలిగిస్తుంది. ఆరావళీ పర్వత శ్రేణుల్లో మౌంట్ అబు నుండి 15 కిలోమీటర్ల దూరంలో నెలకొని ఉన్న శిఖరం గురు శిఖరం. ఇది 1772 మీటర్ల ఎత్తులో ఉంటుంది. దీనిపై నుండి పర్యాటకులు అన్నీ పర్వతాలతోపాటు పక్షులను కూడా చూడవచ్చు. ఈ పర్వత శిఖరంలో ప్రాచీన గురుదత్త ఆలయం కనబడుతుంది. అంతేకాక ఇక్కడే ఖగోళ శాస్త్ర పరిశోధన నిమిత్తం పరిశోధనా కేంద్రం కూడా ఉంది. విజయవాడ నుండి మౌంట్ అబు కు రోడ్డు మార్గం ద్వారా సుమారు 1602 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. రైలు సౌకర్యం ఉంది. వాయు మార్గం ద్వారా అయితే ఉదయపూర్ వరకు విమాన సౌకర్యం ఉంది. ఇక్కడ రోజుకు మధ్యతరగతి హోటల్స్ సుమారు వెయ్యి నుండి పదిహేనువందలు, ఎగువ మధ్యతరగతి వసతులతో కూడినవి రెండు వేల నుండి రకరకాల ధరలతో వసతి సౌకర్యం లభిస్తుంది.

ఆంధ్రా ఊటీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మదనపల్లె దగ్గర హార్స్‌లీహిల్స్ వేసవి పర్యాటకానికి అనువైన ప్రదేశం. వేసవి కాలంలో ఇక్కడకొచ్చే సందర్శకులు కూడా ఎక్కువే. వేడి వాతావరణం నుండి ఉపశమనం పొందాలంటే ఈ ప్రాంతానికొస్తే సరి హాయిగా చల్లని వాతావరణాన్ని ఆస్వాదించవచ్చు. ఈ కొండలను ఇంతకు ముందు ఏనుగు ఎల్లమ్మ కొండ అని పిలిచేవారట. పూర్వం ఇక్కడ మల్లమ్మ అనే బాలిక ఏనుగులను సంరక్షించేదని, అడవి జాతులను కాపాడేదని, అందుకే ఆమె పేరుతోనే ఈ ప్రాంతాన్ని పిలిచేవారని చెబుతుంటారు. అయితే తర్వాతి కాలంలో హార్స్‌లీ అనే బ్రిటిష్ అధికారి ఈ ప్రదేశాన్ని సందర్శించి వేసవి విడిదికి ఇది అనువైన స్థలమని భావించి ఇక్కడే ఆయన

రెండు ఇళ్లు, కరాచీ రూమ్ నిర్మించారు. అప్పటి నుండి దీన్ని ఆయన పేరుతోనే పిలవబడుతుంది. ఈ ప్రాంతం తిరుపతి నుండి 144 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ యుకోలిప్టస్, గుల్‌మొహర్ చెట్లు విరివిగా కనబడతాయి. అంతేకాదు ఇక్కడ ట్రెక్కింగ్ చేయడానికి కూడా వీలుంటుంది. దీన్ని ఆంధ్రా ఊటీ అని కూడా అంటారు. ఇక్కడ పర్యావరణ పరిరక్షణ శాఖ ఉద్యానవనం ఉంది. ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖవారి హోటల్‌కూడా దర్శనమిస్తాయి. వేసవిలో చాలా తక్కువ ఖర్చుతో విహారయాత్ర చేయాలనుకునేవారు హార్స్‌లీ హిల్స్ చూడచ్చు.

అరకు వ్యాలీ

దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ జిల్లాలోని అరకు వ్యాలీ ముఖ్యమైన హిల్ స్టేషన్. ఇది తూర్పుకనుమలలో ఉండి ఏడాది పొడవునా పర్యాటకులకు ఆహ్లాదాన్ని అందిస్తుంది. ఈ ప్రాంతంలో అధిక వాణిజ్యం లేకపోవడంతో ఈ ప్రదేశానికి రావాల్సిన ప్రాచుర్యం రాలేదు. విశాఖనుండి సుమారు 144 కిలోమీటర్ల దూరంలో అరకు ఉంటుంది. ఇది అందమైన ప్రకృతి రమణీయతకు మారుపేరేగాక కాఫీ, తేయాకు తోటలకూ పెట్టింది పేరు. ఇక్కడ ట్రైబల్ మ్యూజియం, బొర్రా గుహలు, బొటానికల్ గార్డెన్, సంగధా ఫాల్స్ వంటి ఆకర్షణలు ఇక్కడ ప్రత్యేకం. ఈ ప్రాంతం సముద్ర మట్టానికి 996 మీటర్ల ఎత్తులో ఉంటుంది. అందుకే ఏడాది మొత్తంలో ఒక మోస్తారు వాతావరణం కలిగి ఉంటుంది. కానీ శీతాకాలంలో మాత్రం చలి తీవ్రత ఎక్కువగానే ఉంటుంది. బొర్రా గుహలు అనంతగిరి కొండల్లో భాగం. వీటిని 1807 సంవత్సరంలో విలియం కింగ్ జార్జ్ గుర్తించాడు. అప్పటి నుండి ఈ ప్రాంతంలో బొర్రా గుహలు ప్రసిద్ధికెక్కాయి. ఇవి మన దేశంలోనే అతి పెద్ద గుహలు. ఇక ఇక్కడే సగంద వాటర్ ఫాల్స్ చూపరులను ఆకట్టుకుంటుంది. ఈ జలపాతాలు దట్టమైన అడవి మధ్యలో ఉన్నాయి. ఇక్కడ జలపాతాలలోని నీటి చప్పుడు కొన్ని మైళ్ల దూరం వరకు వినబడుతుంది. ఇక్కడే టైడా అనే గ్రామం తూర్పు కనుమల్లో ఉంటుంది. ఈ గ్రామం విశాఖకు సుమారు 75 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ గ్రామంలో కొయ్యి గుడిసెలు, చెట్లపై ఇళ్ళు, రిసార్టులు వంటివి ఉంటాయి. చాలా మంది వారాంతరాల్లో, వేసవి సమయంలో ఇక్కడ సేదతీరతారు. అతి తక్కువ ఖర్చుతో అరకు వ్యాలీ వేసవి విహారయాత్ర హాయిగా గడపవచ్చు.

- సాంత్వన్

ఆరోగ్యపరమైన జాగ్రత్తలు

విహారయాత్రకు వెళ్లేవారు ముఖ్యంగా మెడికల్ కిట్ దగ్గరపెట్టుకోవడం మంచిది. అందులో చిన్న చిన్న గాయాలకు ప్రథమ చికిత్స చేసేందుకు ఉపయోగపడే విధమైన వస్తువులు, జ్వరం, జలుబు, కడుపు నొప్పి, విరేచనాలు, వాంతులు వంటి సమస్యలకు తాత్కాలిక ఉపశమనం కలిగించే మందులను మీకు దగ్గర్లోని డాక్టర్‌గారి సలహా మేరకు వెంటతీసుకెళ్లాలి. చక్కెర వ్యాధి గ్రస్తులు ఇన్సులిన్‌తో పాటు కొన్ని సందర్భాల్లో షుగర్ లెవల్స్ తగ్గిపోయే అవకాశం ఉంటుంది అందుకే పండ్లు, తినుబండారాలు దగ్గర పెట్టుకోవాలి. చాలా మంది పెద్దవారు డయాబెటిస్ ఉంది కనుక ఏమీ తినకూడదు అని ఉపవాసాలు చేస్తుంటారు. అది మంచిది కాదు. రక్తపోటు , గుండె జబ్బులు కలవారు క్రమం తప్పకుండా మందులు తీసుకోవాలి. వారి ఆరోగ్య పరిస్థితి గురించి పక్కవారితో చెప్పాలి. ఈత కొట్టడం, బరువులు ఎత్తడం చేయకూడదు. మోకాళ్ల నొప్పులు, అధిక బరువు ఉన్నవారు కొండ ప్రాంతాలు ఎక్కకపోవడం ఉత్తమం. ట్రెక్కింగ్ వంటివి చేసేప్పుడు ఆదమరిచి ఉండకూడదు. తప్పని సరిగా విహర యాత్రకు వెళ్లేముందు మీ ఫ్యామిలీ డాక్టరు సలహాలు తీసుకొని ప్రయాణమైతే చాలా వరకూ ఆరోగ్య పరంగా ఎదురయ్యే అవరోధాలను అధిగమించినట్లే.

డా॥ యలగాల హనుమంతరావు, ప్రజా వైద్యశాల, అద్దంకి, ప్రకాశం జిల్లా

ప్రేమ... విప్లవం...

(భాగం -26) **మార్క్స్, జెన్నీ ప్రేమ కథ**



'న్యూ రైనిష్ జైటుంగ్–పొలిటికల్ ఎకనామిక్ రివ్యూ' ప్రారంభించటానికి హాంబర్గ్‌లో తనకో ప్రచురణ కర్త, పంపిణీదారు దొరికాడని డిసెంబర్‌లో తన సన్నిహితుడు వైడెమియర్‌కు రాశాడు మార్క్స్. పత్రిక జనవరిలో ప్రారంభమవుతుందని ప్రకటన కూడా యిచ్చాడు.

కాని, ఎప్పుడూ వుండే డబ్బు సమస్యలవల్ల ప్రచురణ ఆలస్యమైంది. జనవరిలో రాలేదు. ఫిబ్రవరి కూడా గడిచింది. సమస్యలు పెరిగినప్పుడల్లా జబ్బుపడటం మార్క్స్‌కు మామూలే. ఈసారీ అదే జరిగింది. పత్రిక సంగతి ఇలా ఉంటే, ఇంట్లో అప్పుల వాళ్ల బాధపెరిగింది. ముఖ్యంగా మార్క్స్‌ను చికాకుపెట్టింది. ఒక జర్మన్ డాక్టర్ జెన్నీ ప్రసవం అప్పుడు వచ్చాడు. తనను పీల్చేస్తున్నాడే డాక్టర్ అతని పై కేసు పెడతానన్నాడు మార్క్స్. అయితే, ఈ తగువుతో తనకే మరింత నష్టం జరిగింది. ఇంట్లో ఎవరికీ ముఖ్యంగా, గుయిడోకు వైద్య సహాయం లభించలేదు. మార్క్స్ ఇంటి సమస్యల్ని శరణార్థులు కథలుగా చెప్పుకున్నారు. ఇలాంటి పరిస్థితిని భరించటం కష్టం. కాని ఏమీ చెయ్యలేడు. చెయ్యిచాచకపోతే రోజు గడిచే పరిస్థితి లేదు. తనను నవ్వుల పాలు చేస్తున్న సాటి జర్మనుల మీద కోపం పెరిగింది. రచనల్లో పదును, వ్యంగ్యం కూడా రెట్టింపైంది.

చివరికి మార్చి నెలలో వచ్చింది పత్రిక. ముఖ్యమైన ఒక కొత్త వ్యాసపరంపర ప్రారంభమైంది. పేరు "ది క్లాస్ స్ట్రగుల్ ఇన్ ఫ్రాన్స్" ఫ్రాన్సులో వర్గపోరాటం. ఇటీవలి ఫ్రెంచి తిరుగుబాటును విశ్లేషించే క్రమంలో మార్క్స్ తొలిసారిగా "కార్మికవర్గ నియంతృత్వం" అనే మాట వాడాడు(తర్వాత రోజుల్లో లెనిన్ దీన్ని పునర్‌నిర్వచించాడు). "అసలైన పూర్తి కమ్యూనిస్టు వ్యవస్థను సాధించుకునే క్రమంలోని ఒక ముఖ్య మజిలీ "కార్మికవర్గ నియంతృత్వం".

"తెల్లవారే, మార్క్స్ మరో ఇంటికి మారటానికి ప్రయత్నించారు. కాని నలుగురు పిల్లలున్నారని చెప్పటంతో ఏ ఇంటి యజమానీ అంగీకరించలేదు. చివరికి ఒక మిత్రుడు వాళ్లను లెస్టర్‌స్క్వేర్‌లోని ఒక హోటల్‌లో వుండమన్నాడు. కాని పోలీసులు వాళ్లను ఇల్లు ఖాళీ చెయ్యకుండా అడ్డుకున్నారు. అప్పటి ఇంగ్లీషు చట్టం ప్రకారం సూర్యాస్తమయం తర్వాత ఇల్లు మారకూడదు. "ఇంటి యజమాని మావైపు అనుమానంగా చూస్తాడు. "

"సోషలిజమనేది శాశ్వత విప్లవ ప్రకటన. వర్గ నియంతృత్వం ఆ దారిలో ఒక మజిలీ. దీనివల్లనే వర్గ భేదాలు నిర్మూలించబడతాయి(వర్గ భేదాలకు కారణం వర్గ సంబంధాలు). దీనివల్ల ఉత్పత్తి సంబంధాలకు సంబంధించిన సామాజిక సంబంధాలు కూడా మారతాయి. సామాజిక సంబంధాల వల్ల ఏర్పడిన భావజాలంలో కూడా విప్లవాత్మకమైన మార్పు వస్తుంది".

యూరోప్‌లో పరిస్థితులు కాస్త చల్లబడటానికి కారణం కాలిఫోర్నియాలో కనిపించిన బంగారు నిల్వలన్నాడు మార్క్స్. ఈ ఆవిష్కరణతో ఆర్థిక పరిస్థితులు మెరుగుపడే అవకాశముంది. అయితే, బంగారం సంగతెలా వున్నా, మరో ఆర్థిక సంక్షోభం మాత్రం తప్పదు. దీనివలన రాబోయే తిరుగుబాటు సమగ్రమైనది, సర్వవ్యాప్తమైనది.

పత్రికలో బూర్జువాలను సమర్థించే వాళ్లను నిర్దయగా విమర్శించాడు. తన కమ్యూనిస్టు అభిప్రాయాలలో ఎక్కడా రాజీలేదు. కార్మిక వర్గం గురించే రాశాడు. వాళ్ల కోసమే రాశాడు. ఆధునిక సమాజంలో తొలి వర్గపోరాటానికి తెర తీసింది వీళ్లే (పారిస్‌లో). ఇప్పుడక్కడ పోరాటాన్ని అణచివేసినా, తానూ, తన సహచరులూ వాళ్ల తరపున లండన్‌లో ఆ పోరాటాన్ని కొనసాగిస్తారు.

తన అభిప్రాయాలను అందరితో పంచుకోవటానికి మంచి వేదికగా మారింది పత్రిక. దీనివలన లాభాలు వచ్చే అవకాశం లేదని ప్రారంభించక ముందే తెలుసు. దీని

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**

సంపాదకుడు (మార్క్స్) లండన్‌లో వున్నా, పత్రికల మీద కఠిన నిబంధనలున్న హాంబర్గ్‌లో వున్నాడు ప్రచురణకర్త. పునర్వ్యవస్థీకరించబడిన కమ్యూనిస్టు లీగ్ జర్మనీలో అల్లర్లకు ప్రయత్నిస్తున్నారని అధికారులకు తెలిసింది. పైగా, పత్రిక ప్రస్తుత వ్యవస్థ మీద ఎంతటి కోపం ప్రదర్శించిందంటే పెట్టుబడి పెట్టే వాళ్లే కరువయ్యారు. పంపిణీలో సమస్యలు తలెత్తాయి.

కొన్ని చందాలు వసూలైనా అవి మార్క్సుకు చేరలేదు.

మార్క్స్ దంపతులు, ఎంగెల్స్ డబ్బులకోసం తీవ్రంగా ప్రయత్నించారు. పత్రికను ఎలాగైనా నడపాలి. కాని సమస్య ఇప్పుడు తీవ్రతరమైంది. ఒకవైపు పత్రికకు, మరోవైపు శరణార్థులకోసం డబ్బు అడుగుతున్నారు. ఇక ఇంటి పరిస్థితి చెప్పుకునేది కాదు. మార్క్స్ ఎంత రహస్యంగా వుంచాలనుకున్నా అందరికీ తెలిసిపోయింది. ప్రత్యర్థులకిది మంచి అవకాశం. మార్క్స్, అతని మనుషులు శరణార్థుల కోసం సేకరించిన విరాళాలు సొంతానికి వాడుకుంటున్నారని పుకార్లు పుట్టించారు. మార్క్స్ సేకరించిందంతా కేవలం కమ్యూనిస్టులకే ఇచ్చి మిగతావాళ్లను విస్మరించాడని కూడా ప్రచారం చేశారు. ఈ నీలి వార్తలు కేవలం లండన్‌కే పరిమితం కాలేదు. జర్మనీలోని వార్తాపత్రికల్లో కూడా దీని గురించిన కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నీలాపనిందలు చదివి మార్క్స్, జెన్నీ, ఎంగెల్స్‌లు కుమిలి పోయారే గాని చెయ్యవలసిందేమి లేదు. ప్రస్తుతానికి పరువు మర్యాదలు తప్ప పైసా లేదు.

జర్మనీలో వున్న వైడెమియర్‌కు రాసిన ఒక లేఖలో జెన్నీ యిలా వాపోయింది,

"పత్రిక డబ్బులేమైనా వుంటే తక్షణం పంపించమని వేడుకుంటున్నాను. ఎంతవున్నా సరే. డబ్బు మాకు అత్యవసరం. ఇన్నేళ్లుగా మా

"ఇంతకూ ఇంతమంది దృష్టిని ఆకర్షించిన మార్క్స్ ఎవరు? 1850 నాటి పరిస్థితులను పరిశీలిస్తే, ఆనాటికి ఆయన నాయకుడు. బహుశా, యూరోపియన్ ప్రతిపక్ష రాజకీయాల్లో ఆయన పేరెక్కడయినా వినిపించి వుండవచ్చు. పెద్దగా పేరులేని ఫిలాసఫర్, జర్నలిస్ట్. యూనివర్సిటీలో వున్నప్పుడు ఆయన ఎవర్నీ ప్రభావితం చేశాడని చెప్పలేం. ఇప్పుడైతే అసలాయన గురించి ఎవరికీ తెలిసే అవకాశమే లేదు. అయితే, ప్రష్యన్ అధికారులకు ఆయన ఆందోళనకారుడిగా బాగా తెలుసు, త్వరలో అంతరంగిక మంత్రి కాబోతున్న తన బావమరిదికి కంటిలో నలుసు.. కాలిలో ముల్లు. ముఖ్యంగా 'మార్క్స్ బూచి' ప్రష్యన్ ప్రభుత్వానికి చాలా ఉపయోగకరం. 1848 తర్వాత, యూరోపియన్ ప్రభుత్వాలు, తిరుబాట్లకు పత్రికలే కారణమన్నాయి."

జిసెపి మజని

కృషిలో మేమెంత కోల్పోయామో, ఎన్ని కష్టాలు అనుభవించామో ఎవరికీ చెప్పుకోలేదు. మా సొంత సమస్యలతో జనాన్ని ఎప్పుడూ యిబ్బంది పెట్టలేదు. నా భర్త చాలా సున్నితమనస్కుడు. ఉన్నదంతా పోగొట్టుకోవటానికైనా ఇష్టపడతాడు గాని ఒకరిమందు చెయ్యిచాచడు. మాకు డబ్బులు ఉచితంగా అక్కర్లేదు. తన కొలోన్ మిత్రుల నుండి పత్రికకు సహాయం అడిగే హక్కు నా భర్తకుంది. కాని అక్కడ, అందరూ కలిసి పత్రికను నాశనం చేశారు. ఎవరు ఎక్కువ చేశారో, ఎవరు తక్కువ చేశారో మాకైతే తెలియదు. పత్రికను అమ్మిన వాళ్ల డబ్బు పంపక పోవటమా లేక మిత్రులు వ్యాపారాన్ని సరిగా నిర్వహించలేకపోవటమా లేక డెమోక్రాట్లు వైఖరే యిందుకు కారణమా?

ఇక్కడ బూర్జువా జీవిత భారం కింద నలిగిపోతున్నాడు నా భర్త. రోజువారీ పనులు కూడా చేసుకోలేకపోతున్నాం. దినదినగండంగా, క్షణమొక యుగంలా గడుస్తున్నది..."

వైడెమియర్ కింకా ఏమైనా వివరణ కావాలనుకుంటే, తన 'జీవితంలో ఒక రోజు' గురించి ఇలా రాసింది జెన్నీ. ఇప్పటికి గుయిడోకు ఆరునెలలు. పుట్టినప్పటి నుండీ రెండు గంటలకన్నా ఎక్కువ ఎప్పుడూ నిద్రపోలేదు. అప్పుడప్పుడూ మూర్ఛలు (ఫిట్సు) వస్తున్నాయి. అది జీవన్మరణ పోరాటం. "తన బాధతో వాడు నా రొమ్ము ఎంత గట్టిగా కొరికాడంటే గాయమై వుండు యింకా మానలేదు. అప్పుడప్పుడూ నెత్తురు వచ్చి వాడి చిన్నారి నోటిలోకి పోతోంది. ఒకసారి పిల్లాడికి పాలిస్తున్నప్పుడు ఇంటి యజమానురాలు వచ్చి, బాకీ వున్నామని ఐదు పౌండ్లు తక్షణం ఇవ్వమంది. ఉంటేగా ఇవ్వడానికి. పెద్దగా అరిచి నన్ను భయపెట్టి డబ్బు తీసుకోవాలనుకుంది. ఇద్దరు కోర్టు జవాన్లు ఇంట్లోకి ప్రవేశించి బెడ్, దుస్తులు, చంటివాడి ఊయల, చివరికి పిల్లల బొమ్మలు (పిల్లలు భయపడి ఎంత ఏడ్చినా) కూడా స్వాధీనం చేసుకుని రెండుగంటల్లో తీసుకుపోతామన్నారు. చలికి వణుకుతూ నేను నేలమీద పడుకున్నాను. రొమ్ముకైన గాయం సలుపుతోంది". జెన్నీ కాన్రాడ్ ష్రామ్ అనబడే మిత్రుడి సాయం కోరింది. కాని, అతడి గుర్రపు బండికి కట్టిన గుర్రాలు భయపడి పరిగెత్తాయి. అతడు కిందపడి గాయాలపాలు కావటంతో తమ యింటికే తీసుకువచ్చారు. అసలే చిక్కుల్లో వుంటే మరో మనిషికి సేవ చేయాలి.

తెల్లవారే, మార్క్స్ మరో ఇంటికి మారటానికి ప్రయత్నించాడు. కాని నలుగురు పిల్లలున్నారని చెప్పటంతో ఏ ఇంటి యజమానీ అంగీకరించలేదు. చివరికి ఒక మిత్రుడు వాళ్లను లెస్టర్‌స్క్వేర్‌లోని ఒక హోటల్‌లో వుండమన్నాడు. కాని పోలీసులు వాళ్లను ఇల్లు ఖాళీ చెయ్యకుండా అడ్డుకున్నారు. అప్పటి ఇంగ్లీషు చట్టం ప్రకారం సూర్యాస్తమయం తర్వాత ఇల్లు మారకూడదు. "ఇంటి యజమాని మావైపు అనుమానంగా చూస్తాడు. అతని వస్తువులేమైనా మా వాటిలో కలిసిపోయి వుండొచ్చునంటాడు. ఉన్నపళంగా ఇల్లు ఖాళీ చేస్తున్నామంటే విదేశాలకు పారిపోతున్నాం అనుకుంటాడు. ఐదు నిమిషాల్లో రెండు మూడు వందల మంది పోగై మావైపు ఎగాదిగా చూస్తారు". ఇదివరకు కూడా మార్క్స్ దంపతులు అనేకసార్లు చిక్కుల్లో ఇరుకున్నారుగాని ఇంత దారుణమైన, అవమానకర పరిస్థితి ఎప్పుడూ రాలేదు. సామానంతా వీధిలో వుంది. తెల్లారి వరకు అదంతా మళ్లీ ఇంట్లోకి తెచ్చుకోవాలి.

తరువాత, మార్క్స్ దంపతులు లెస్టర్‌స్క్వేర్‌కు మారారు గాని, వారంలోగానే అక్కడా యజమాని వాళ్లను వెళ్లిపొమ్మన్నాడు. కారణం డబ్బు సమస్యే. అద్దె యివ్వకపోతే ఎవరుండనిస్తారు.?(గుయిడో ఏడుపు వల్ల హోటల్లో వుంటున్న యితర అతిథులకు కలిగిన అసౌకర్యం మరో కారణం కావచ్చు). చివరికి, జెన్నీ తల్లి కొంతడబ్బుపంపి వాళ్లనాదుకుంది. 64, డీన్ స్ట్రీట్‌లో రెండు గదులకు మారారు మార్క్స్ దంపతులు.

ఇక, పత్రిక ఆరు ఎడిషన్లు మాత్రమే వచ్చింది. డబ్బులు లేవు. అధికారులు యిబ్బంది పెట్టారు. ప్రష్యాలో పత్రిక విక్రేతకు ప్రభుత్వం లంచమిచ్చి పంపిణీ చెయ్యకుండా అడ్డుకుందని ఆరోపించింది జెన్నీ.

డీన్‌స్ట్రీట్‌లో మార్క్స్ వుంటున్న ఇంటి యజమాని ఒక యూదు లేస్ వ్యాపారి. అతడు అంతకు ముందు ఒక గదిని లీగ్ సభ్యుడు హైన్రిష్

జోసెఫ్ కోసత్

బార్‌కు కూడా అద్దెకిచ్చాడు. "1793లో ఫ్రాన్సులో జరిగినట్టే ఇప్పుడు జర్మనీలో జరుగుతుంది" అన్న ప్రకటనతో అతడు లీగ్ కేంద్ర కమిటీ తరపున జర్మనీకి ప్రచారం నిమిత్తం వెళ్లాడు(1793 విప్లవంలో ఫ్రెంచి రాజును శిరచ్ఛేదంచేశారు). "విప్లవం మలి దశలో ఇక అందర్నీ సాయుధుల్ని చేయటమే తరువాయి. జనం ఇక మీద బూర్జువా డెమోక్రాట్ల బృందగానాలకు చప్పట్లు గొట్టరు" అని కూడా చెప్పింది కమిటీ.

"బార్, జర్మన్ కార్మికుల్లో ప్రచారం చేస్తున్నప్పుడు యాదృచ్ఛికంగా ఒక సంఘటన జరిగింది. ఒక ఉన్మాది జర్మన్ రాజు హత్యకు విఫల ప్రయత్నం చేశాడు. జర్మనీలో బార్ చేస్తున్న ప్రచారం, కేంద్ర కమిటీ ప్రకటనలు, మార్క్స్ పత్రికలో వస్తున్న రెచ్చగొట్టే వ్యాసాలు రిపోర్టు అన్నీ కలిసి, హత్యా ప్రయత్నం వెనుక లీగ్ హస్తం వున్నదనే అనుమానం రేకెత్తించాయి. మార్క్స్ మిత్ర బృందమే యిందుకు కారణమన్నాయి ప్రష్యన్ పత్రికలు. ఒక పత్రికైతే, 'మార్క్స్ ఇటీవల బెర్లిన్‌లో కనిపించాడు' అని కూడా రాసింది(ఇది ఎంగెల్స్ కథనం).

ఈ వార్తలు ఆధారంగా ప్రష్యన్ ప్రభుత్వం ప్రమాదకరమైన తీవ్రవాదులను బహిష్కరించమని ఇంగ్లీషు అధికారులను కోరింది. బెర్లిన్‌లో ఒక బ్రిటిష్ రాయబారి, ప్రష్యన్ అంతరంగిక మంత్రిత్వశాఖ నుండి ఒక రహస్య నివేదిక అందుకున్నాడు. దాని ప్రకారం "మార్క్స్ ముఠా కేవలం జర్మనీలో అల్లర్లను సృష్టించడమే కాదు. ఇంగ్లండులో మహారాణికి వ్యతిరేకంగా కూడా కుట్ర పన్నుతుంది. ఆయన వద్ద ఇరవై మంది సుశిక్షితులైన మనుషులున్నారు. ఇలాంటి సందర్భాల్లో పోలీసులు ఎలా ప్రవర్తిస్తారో మార్క్స్, జెన్నీకి బాగా తెలుసు. వీళ్ల దృష్టి నుండి తప్పించుకోవటానికి గ్రామాల్లోకి వెళ్లిపోదామనుకున్నారు. కాని మళ్లీ అదే సమస్య డబ్బులేదు. ఇక మిగిలింది, పత్రికల్లో వస్తున్న ప్రతి బూటకపు వార్తనూ ఖండిస్తూ పోవటమే. జర్మన్‌రాజు హత్యా ప్రయత్నంతో తమకి సంబంధమున్నదనటం ఒక అభూతకల్పన అని అన్ని ప్రముఖ లండన్ వార్తాపత్రికలకు సంపాదక లేఖలు రాశారు. ఇది బ్రిటిష్ పోలీస్ ఏజెంట్ల కుట్ర అని ప్రజలకు అన్యాపదేశంగా అప్పీలు చేశారు. ఒక నమూన లేఖ.

"అయ్యా, వారం రోజుల స్వల్ప వ్యవధిలో ఇంతమంది పోలీస్ గూఢచారులతో పరిచయం చేసుకోగలమని మేం కలలో కూడా వూహించలేదు. మేముండే ఇళ్ల మీద గట్టి నిఘా వుంది. మా ప్రతి కదిలికనూ గమనిస్తున్నారు. మా ఇంటికి వచ్చి పోయే వాళ్లందరి వివరాలూ సేకరిస్తున్నారు. ఎక్కడికి వెళ్లినా మమల్ని వెంబడిస్తున్నారు. ఎవరో ఒక అపరిచిత మిత్రుడు వెంటలేకుండా మేం బస్సెక్కలేం. కాఫీ హోటలుకు వెళ్లలేం. ఈ పరిస్థితిలో ఇంకా ఎవరో మా మీద గూఢ చర్యలు చేయడం వల్ల ఏం ప్రయోజనముంటుంది. ఈ గూఢచారులు, ఇన్ఫార్మర్లుగా పురుషవేశ్యలు-డబ్బులకమ్ముడు పోయిన నీచమానవులు!."

ఇంగ్లీషు వాళ్లకు శరణార్థులంటే ముఖ్యంగా గడ్డం పెంచుకున్న వాళ్లంటే వీళ్లు నాస్తికులూ అవినీతిపరులూ అని గట్టి నమ్మకం. అయినా వాళ్లందరికీ దేశ బహిష్కరణ శిక్ష విధించాలనేంత కోపం మాత్రం లేదు.(ఎవరి పాపాన వాళ్లు పోతారు. మనమెందుకు వాళ్లను గెంటెయ్యటం!)

" మార్క్స్ దంపతులు, ఎంగెల్స్ డబ్బులకోసం తీవ్రంగా ప్రయత్నించారు. పత్రికను ఎలాగైనా నడపాలి. కాని సమస్య ఇప్పుడు తీవ్రతరమైంది. ఒకవైపు పత్రికకు, మరోవైపు శరణార్థులకోసం డబ్బు అడుగుతున్నారు. ఇక ఇంటి పరిస్థితి చెప్పుకునేది కాదు. మార్క్స్ ఎంత రహస్యంగా వుంచాలనుకున్నా అందరికీ తెలిసిపోయింది. ప్రత్యర్థులకిది మంచి అవకాశం. మార్క్స్, అతని మనుషులు శరణార్థుల కోసం సేకరించిన విరాళాలు సొంతానికి వాడుకుంటున్నారని పుకార్లు పుట్టించారు. మార్క్స్ సేకరించిందంతా కేవలం కమ్యూనిస్టులకే ఇచ్చి మిగతావాళ్లను విస్మరించాడని కూడా ప్రచారం చేశారు. ఈ నీలి వార్తలు కేవలం లండన్‌కే పరిమితం కాలేదు. జర్మనీలోని వార్తాపత్రికల్లో కూడా దీని గురించిన కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నీలాపనిందలు చదివి మార్క్స్, జెన్నీ, ఎంగెల్సులు కుమిలి పోయారే గాని చెయ్యవలసిందేమి లేదు. ప్రస్తుతానికి పరువు మర్యాదులు తప్ప పైసా లేదు. "

తమ సామాజిక, రాజకీయ వ్యవస్థ ఎంత పటిష్ఠమైనదంటే ఈ కొద్ది మంది విదేశీ రాడికల్స్ దాన్నేమీ చెయ్యలేరు. "ఇంగ్లీషు వాళ్ల రాజకీయ విభేదాలు కారణంగా ఎవరి హక్కులీ్నీ కాలరాయరు" అని గర్వంగా చెప్పకుంటారు. సంపాదక లేఖల ప్రభావమో కాదో చెప్పలేం గాని, మార్క్స్ బృందం మీద తదుపరి చర్యలేవీ తీసుకోలేదు. బహిష్కరించాలన్న ప్రష్యన్ ప్రభుత్వ లేఖకు కూడా బ్రిటిష్ అధికారులు సమాధానం పంపలేదు.

ఇంతకూ ఇంతమంది దృష్టిని ఆకర్షించిన మార్క్స్ ఎవరు? 1850 నాటి పరిస్థితులను పరిశీలిస్తే, ఆనాటికి ఆయన నాయకుడు. బహుశా, యూరోపియన్ ప్రతిపక్ష రాజకీయాల్లో ఆయన పేరెక్కడయినా వినిపించి వుండవచ్చు. పెద్దగా పేరులేని ఫిలాసఫర్, జర్నలిస్ట్. యూనివర్సిటీలో వున్నప్పుడు ఆయన ఎవర్నీ ప్రభావితం చేశాడని చెప్పలేం. ఇప్పుడైతే అసలాయన గురించి ఎవరికీ తెలిసే అవకాశమే లేదు.

అయితే, ప్రష్యన్ అధికారులకు ఆయన ఆందోళనకారుడిగా బాగా తెలుసు. త్వరలో అంతరంగిక మంత్రి కాబోతున్న తన బావమరిదికి కంటిలో నలుసు.. కాలిలో ముల్లు. ముఖ్యంగా 'మార్క్స్ బూచి' ప్రష్యన్ ప్రభుత్వానికి చాలా ఉపయోగకరం. 1848 తర్వాత, యూరోపియన్ ప్రభుత్వాలు, తిరుబాట్లకు పత్రికలే కారణమన్నాయి. గోరంత సామాజిక అసంతృప్తిని కొండంత చేసి చూపించాయి. ప్రభుత్వమంటే భయం, భక్తి వున్న అమాయక ప్రజల్ని రెచ్చగొట్టాయి. తిరుగుబాట్ల వెనుక, హింస వెనుక మార్క్స్ వున్నాడు. అతనిది కమ్యూనిస్టు పత్రిక. ప్రజల్లో అశాంతికి కారణం అతడే. అతడి గురించి ఎవరికీ ఎక్కువగా తెలియదుగనక అతణ్ని సమర్థించే వాళ్లు కూడా ఎవరూ వుండరు.

ఇక, లండన్‌లోని రాజకీయ ప్రత్యర్థులకూ, శరణార్థులకూ అతణ్ని నిందించటానికి ఎన్నోకారణాలున్నాయి. అవేవీ అతడి రచనల గురించీ, అభిప్రాయాలు గురించీ కాదు. మార్క్స్ తన స్వభావంతో, ప్రవర్తనతో చాలా మందిని శత్రువులను చేసుకున్నాడు. విప్లవకారులను రొమాంటిక్ హీరోలుగా జనం ఆరాధిస్తున్న కాలమది. ఉదాహరణకు ఇటాలియన్ జిసెపి మజని, హంగేరియన్ జోసెఫ్ కోసత్. కాని మార్క్స్‌ని ఎవరూ యిష్టపడలేదు. అహంకారి, దురుసు స్వభావం, కోపిష్టి, ఎవర్నీ దగ్గరకు రానివ్వడు. ఒకరాయన్ను 'మహాజ్ఞాని, యువ దలైలామా మార్క్స్' అంటూ అభివర్ణించారు.

సశేషం

▪ ఫోన్: 91776 18708

పేలాలతో

కావలసిన పదార్థాలు: జొన్నలు–1 కప్పు, కారం, 1టీ స్పూను, వాము–1, టీస్పూను, వేయించిన నువ్వులు– అరకప్పు, ఉప్పు రుచికి తగినంత.

తయారుచేసే విధానం: జొన్నల్ని 8గంటలపాటు నానబెట్టి నీరంతా వడకట్టి కొద్ది సేపు అరబెట్టాలి. వీటిని కడాయిలో వేసి (మూతపెట్టి) సన్నని సెగమీద ఉంచితే పేలాలవుతాయి. తర్వాత ఒక పాత్రలో పేలాలు, కారం, వాము, నువ్వులు, ఉప్పు వేసి (కొద్దిగా) నీరు చిలకరిస్తూ కలపాలి. పేలాలు మెత్తబడ్డాక ఈ మిశ్రమాన్ని పిడికిట్లోకి ముద్దలా నువ్వులు, ఉప్పు వేసి (కొద్దిగా)నీరు చిలకరిస్తూ కలపాలి. పేలాలు మెత్తబడ్డాక ఈ మిద్రమాన్ని పిడికిట్లోకి ముద్దలా తీసుకుని పల్చగా పత్తి ఎండ బెట్టుకోవాలి. ఈ వడియాలు వాము, నువ్వులు పంటికి తగిలి ఎంతో రుచిగా అన్పిస్తాయి



రకరకాల వడియాలు

మినప వడియాలు

కావల్సిన పదార్థాలు : మినపప్పు –1కిలో, జీలకర్ర –4టీస్పూన్స్, పచ్చిమిరపకాలు –100గ్రాములు, ఉప్పు –తగినంత.

తయారుచేయు విధానం : మినపప్పును శుభ్రంగా కడిగి ఒక పాత్ర నీరు పోసి దానిలో రాత్రంతా నానబెట్టాలి. రాత్రంతా నాననిచ్చాక ఉదయమే పప్పును శుభ్రంగా కడిగి మినపప్పు పొట్టును వేరుచేయాలి, తరువాత పచ్చి మిరపకాయలును తొక్కి ఆ తొక్కును మినప పప్పు రుబ్బేటపుడు వేసి రుబ్బుకోవాలి. తరువాత జీల్లకర్రవేసి పిండిని కలపాలి. ఇలా రుబ్బుకున్న పిండిని మంచం మీద గానీ అరుగు మీద కానీ గుడ్డలేదా ప్లాస్టిటక్ పేపర్‌పై చిన్న చిన్న వడియాలు పెట్టుకోవాలి. ఇలా పెట్టుకున్న వడియాలను రెండు మూడు రోజులు ఎండలో ఎండనిచ్చిన తర్వాత గుడ్డ లేదా ప్లాస్టిక్ పేపర్ నుండి వేరు చేసి పొడి డబ్బాలో నిల్వచేసుకోవాలి. ఈ వడియాలను తగినంత నూనె లేదా నెయ్యిలో వేయించుకుని తింటే ఆ రుచే వేరుమరి.

బూడిద గుమ్మడి వడియాలు

కావాల్సిన పదార్థాలు : బూడిద గుమ్మడి –1కాయ, మినప పప్పు కాయకు సరిపడా, పచ్చి మిరపకాయలు –100గ్రాములు, ఉప్పు –తగినంత

తయారుచేయు విధానం : బూడిద గుమ్మడికాయను తురుముగా తరిగి ఒక శుభ్రమైన పలుచటి బట్ట తీసుకుని ఈ తురుమును ఆ బట్టలో ఉంచి మూటకట్టి ఈ మూటపై ఏ దైనా బరువు ఉంచాలి. రాత్రంతా ఇలా ఉంచిన తర్వాత ఈ గుడ్డలో నుంచి ఉదయానికి నీరంతా దిగిపోతుంది. ఆ తరువాత మినపప్పును మెత్తగా రుబ్బుకుని ఈ పిండిలో గుమ్మడికాయ తురుము ఉప్పు, పచ్చి మిరపకాయ ముక్కలు వేసి కలపి ప్లాస్టిక్ పేపర్‌పై గాని గుడ్డపైన గానీ కొంచెం పెద్ద సైజులో (రూపాయి బిళ్ల సైజులో) వడియాలు పెట్టుకోవాలి. ఇలా పెట్టుకున్న వడియాలను ఎండలో మూడు నాలుగు రోజులు ఎండబెట్టి పొడి డబ్బాలో నిల్వ చేసుకోవాలి. ఈ వడియాలను ఉల్లిపాయలు లేదా ములక్కాడలతో వండుకుంటే చాలా రుచిగా ఉంటాయి. లేకపోతే చారు కాసుకున్నపుడు వేయించుకుని సంజుకోవచ్చు.



టమోటాలతో

కావాల్సిన పదార్థాలు: టమోటాలు–1200గ్రా., సగ్గుబియ్యం – పావుకేజీ, నీరు –6కప్పులు, ఉప్పు–రుచికి సరపడా, కారం–1టీస్పూను,

తయారుచేసే విధానం : టమోటాలను నీటిలో పావుగంట ఉడికించాలి. చల్లబడ్డాక తొక్క తీసి, మెత్తగా గ్రైండ్ చేసి పక్కనుంచాలి. సగ్గుబియ్యాన్ని 15 నిమిషాలు నానబెట్టి నీరు వడకట్టాలి. నానిన సగ్గుబియ్యానికి 6కప్పుల నీరు జతచేసి కుక్కర్లో 3 విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. చల్లారిన తర్వాత ఉప్పు, కారం, టమోటా గుజ్జు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని (పెద్ద) ప్లాస్టిక్ కవర్‌పై గుండ్రంగా పల్చగా వేసి బాగా ఎండనిచ్చి డబ్బాల్లో నిలువ చేసుకోవాలి.

నీతి పద్యం

తాముసించి చేయత గ దెట్టి కార్యంబు
వేగిరింప నదియు విషమెయగును
పచ్చికాయ దెచ్చి బడవేయ ఫలమౌన?
విశ్వదాభి రామ వినురవేమ

తాత్పర్యం : పచ్చికాయను తొందరపడి తింటే అది పండు అవుతుందా! అలాగే పండును నిల్వచేసి ఉంచితే అది కుళ్లిపోతుంది. దానర్థం ఏ సమయానికి చేయవలసిన పనిని అప్పుడే చేయాలి. అంతేకాని తొందరపడి ముందు చేసిన, ఆలస్యంగా చేసినా అది వ్యర్థమవుతుంది.

పొడుపు విప్పండి చూద్దాం!

1. అడవిలో పుట్టాను అడవిలో పెరిగాను
   వంటినిండా గాయాలు కడుపునిండా రాగాలు
2. ఈ ప్రపంచంలోని వారందరూ నా బిడ్డలే కాని అమ్మా! అని నన్నెవరు పిలవరు
   ఏం చేయాలన్నా ఏమి పొందాలన్నా నాలోనే ఎటూ పోవాలన్నా,
   ఎక్కడికి వెళ్ళాలన్నా నామీదే. నేనెవరో చెప్పుకోండి ?
3. రాజుగారి తోటలో రోజాపూలు
   చూసే వారేగాని లెక్కవేసేవారు కాదు
4. జీడివారి కోడలు సిరిగల వారికి ఆడపడుచు వయసులో కులికే వయ్యారి
   వైశాఖ మాసంలో వస్తుంది.

జవాబులు: 1. పనసపండు, 2. భూమి, 3. చుక్కలు, 4. మామిడి పండు

చుక్కలు కలపండి!

చుక్కలు కలుపుతూ సింహం బొమ్మను గీయండి.



రంగులేద్దాం!

కొమ్మపై కొలువుదీరిన ఈ చిట్టి పిట్టల బొమ్మలు బోసిగా ఉన్నాయి కదా. ఇంకెందుకు ఆలస్యం వాటికి రంగులేసి అలరంకరించండి.



గుండె గుర్తులు ఎన్ని?

అబ్బ...ఈ చిత్రంలో చాక్లెట్లు, కేకులు, పండ్లు, ఐస్‌క్రీమ్ రకరకాల తినుబండారాలు చూస్తుంటే నోరూరుతోంది కదా.. అయితే ఆ బొమ్మలోనే గుండె గుర్తులు(లవ్‌షేప్) దాగున్నాయి. అవి ఎన్ని ఉన్నాయో లెక్కించండి.

బయటకు దారెక్కడ?



మొండిచేతివాడికి నువ్వులు తినడం నేర్పినట్టు....

ఈ సామెత ఎలా వచ్చిందో తెలుసా?

పూర్వం ఒక పిసినిగొట్టువాడు నువ్వులు పండించాడు. మామూలు వ్యక్తిని కాపలాగా పెడితే తినేస్తాడేమోనని చేతులు లేనివాడిని నియమించాడు. వాడి మీద కూడా అనుమానమొచ్చింది. "ఏరా నువ్వులు తింటున్నావా?" అనడిగాడు.

"చేతుల్లేవు కదా, ఎలా తినగలను?" అన్నాడు వాడు. "మొండిచేతులకి నూనె పూసుకుని, వాటిని నువ్వులలో అద్ది తినొచ్చుగా!" అన్నాడు. నిజానికి వాడికా ఆలోచనే లేదు. కాని, యజమాని చెప్పింది విన్న తర్వాత చేతులకి నూనె రాసుకుని నువ్వులు తినడం మొదలెట్టాడు. ఇది ఊరందరికీ తెలిసి పొట్టచెక్కలయ్యేలా నవ్వుకున్నారు. అప్పట్నుంచీ ఈ సామెత వాడుకలోకి వచ్చింది.

పండు ఎవరిది ?

ఏనుగమ్మ...ఏనుగు.. ఈ చిత్రంలో మూడు ఏనుగులు తమ తొండంతో నీటి కొలనులో ఉన్న పండును అందుకునేందుకు పోటీ పడుతున్నాయి కదా! ఆ ప్రయత్నంలో వాటి తొండాలు ఒకదానికొకటి పెనవేసుకున్నాయి. మరి ఏ ఏనుగుది ఏ తొండమో గుర్తుపట్టండి



ఎముక పుష్టి

చాలా మంది అవసరమైనవి తినకుండా నోటికి రుచిగా ఉండే నూడుల్స్, చాక్లెట్లు, పఫ్‌లు ఇలాంటి ఆహార పదార్థాలు తింటుంటారు. ముఖ్యంగా ఆడపిల్లలకు కాల్షియం చాలా ఎక్కువగా లభిస్తేనే ఆ పైన వివాహం తర్వాత, ప్రసవ సమయంలో... ఇంటిపని, ఆఫీసుపని చక్కబెట్టుకునే శక్తిసామర్థ్యాలు ఏర్పడతాయని నిపుణులు చెబుతున్నారు.

మనదేశంలో 40శాతానికి పైగా ఆడపిల్లలు కాల్షియం లోపంతో బాధపడుతున్నారు. తగినంత కాల్షియం ఉంటేనే ఎముకల పటిష్టత బాగుంటుంది. ఇవి మాత్రలు, మందుల ద్వారా కాకుండా వారు తినే ఆహార పదార్థాల నుండే సమకూర్చుకోవాలి. ఎముకలు పటిష్టంగా ఉండాలంటే జింక్ పదార్థాలు ఎక్కువగా

తీసుకోవాలి. మధ్య వయస్సు మహిళల్లో పెళు సుగా ఉండే ఎముకలకు జింక్ చాలా అవసరం. మాంసాహారులైతే జింక్ సమృద్ధిగా లభించే గొర్రె మాంసం తీసుకోవచ్చు. ఇక శాకాహారులైతే ఆకుకూరలు ఎక్కువతీసుకోవచ్చు. తోటకూరలో పుష్కలంగా విటమిన్-కె ఉంటుంది. ఇది శరీరంలోని ఎముకలకు అవసరమైన కాల్షియంను సరఫరా చేయండంలో ఉపయోగపడుతుంది.

అలాగే ఎముకలలోని ఖనిజ లవణాలు చేరడం వలన జీర్ణక్రియకూ తోడ్పడుతుంది. విటమిన్-కె ఆస్టియోపోరోసిస్ వ్యాధి ఉన్నవారికి కాస్త ఉపశమనం కలిగిస్తుంది. ఎముకలు చిట్లిపోవడం తగ్గుతుందని పలు పరిశోధనల్లో వెల్లడైంది. ఆహారపదార్థాలలో ఉప్పును తగ్గించాలి.

తోటకూర, బచ్చలికూర, పొన్నగంటికూర, కొత్తిమీర లాంటి ఆకుకూరలు, పాలు, ఇంకా పాల ఉత్పత్తులను ఎక్కువగా తీసుకోవడం ద్వారా కాల్షియం తగినంత సమకూరి ఎముకలు దృఢంగా ఉంటాయి. ✦

◆ కొత్త పుస్తకాలు

కదిలించే కథనం

ఎగిరే పావురమా
రచయిత : కోసూరి ఉమాభారతి,
పేజీలు : 184 వెల : 75 రూ/-
ప్రచురణ : వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా
ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్

ఆడపిల్ల .అందులోనూ వికలాంగురాలు, మాటకూడా రాదు. ఆపైన పొత్తిళ్లలోనే వదిలేసిన తల్లితండ్రులు! ఇవి చాలుకదా ఆ అమ్మాయి జీవితంలో ఎన్ని సుడిగుండాలు చోటుచేసుకుంటాయో ఊహించడానికి! ఆ సుడిగుండాలను అధిగమించి విజయతీరాలకు చేరితే అది కోసూరి ఉమా భారతి రాసిన 'ఎగిరే పావురమా' నవల అవుతుంది. జీవితంలో ప్రతి ఒక్కరూ ఎంతో ఎత్తుకు ఎదగాలని తపనపడతారు. అలా ఎదిగే క్రమంలో ఎన్నో అవాంతరాలు ఎదురవుతాయి. అందులోనూ పైన చెప్పుకున్న కష్టాల సుడిగుండంలో చిక్కుకున్న గాయత్రి లాంటి అమ్మాయి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడం అంత సులభమేం కాదు... అయితే, ఎదగాలి అన్న కాంక్ష మనసునిండా ఉంటే విజయశిఖరాలు అందుకోవడం అసాధ్యమూ కాదు! ఒక సామాజిక ఇతివృత్తాన్ని కథాంశంగా తీసుకున్న ఉమాభారతి దానిని చక్కగా నవలీకరించారు. ఆడపిల్ల పుట్టకలోనే వినిపించే రాబందుల రెక్కల చప్పుడు నుండి అడుగడుగునా పొంచిఉండే తోడేళ్ల ముప్పును, వాటిని అధిగమించి వికలాంగురాలైన గాయత్రి తన లక్ష్యాన్ని చేరుకునే తీరు చదువరులను కదిలిస్తుంది. ఆలోచింపచేస్తుంది. కంటతడిపెట్టిస్తుంది. పుట్టీపుట్టక ముందే అనాథగా మారిన పసికందును గుడిలో పనిచేసే ఓ తాత పెంచుకుంటాడు. 'వేడుకున్నా పలకలేని ఆ దేవత కన్నా ... పలకలేని నీ నవ్వులే చాలమ్మా' అంటూ గుడిలోని దేవత పేరు 'గాయత్రి'నే ఆ పసికందుకు ఆయన పెట్టుకుంటాడు. తల్లి,తండ్రి అన్నీ తానై అల్లారు ముద్దుగా సాకుతాడు. సన్నిహితులైన పూజారి, ఆయన కూతురి సాయంతో అక్షరజ్ఞానం ఇప్పించడానికి తపిస్తాడు. గాయత్రి కూడా అంతే శ్రద్ధగా చదువుపై మనసు లగ్నం చేస్తుంది. అయితే, అంతా సజావుగా సాగితే అది జీవితం ఎందుకవుతుంది? గాయత్రి జీవితంపైనా కొందరి స్వార్థపరుల కన్నుపడుతుంది. తోడేళ్లమంద చేరుతుంది. ఈ క్రమంలో చోటుచేసుకున్న సంఘటనలేమిటి?సంఘర్షణలేమిటి అన్న అంశాలను నవలలో చదవాల్సిందే. ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన విషయం ఏమిటంటే నవలా రచయిత కోసూరి ఉమాభారతి తెలుగు నేలకు సుదూరంగా ఎక్కడో హోస్టన్‌లో ఉన్నారు. అయినా, తెలుగు భాషను, నుడికారాన్ని, గ్రామీణ వాతావరణాన్ని, మానవ సంబంధాలను కళ్లకు కట్టేలా అక్షరీకరించారు. సారంగ సాహిత్య పత్రికలో సీరియల్‌గా వచ్చిన ఈ నవలను వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు పుస్తకంగా ముద్రించారు. ఉత్తర అమెరికా మొట్టమొదటి తెలుగు కథ 50వ వార్షికోత్సవం సందర్భంగా దీనిని ఆవిష్కరించారు.

- వి. రాజగోపాల్

సామాజిక శతకాలు



సుజనులారా!,
కవి : పి.ఎన్.మూర్తి,
పేజీలు : 36,
వెల : 30/-
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

భక్తి కవులు శతకాలు రాసి తమ ఆరాధ్య దైవాన్ని కీర్తించారు ఒకనాడు. మంచి, నీతిని, సామాజికాంశాల్లో "వేమన" వెల కట్టలేని ఆటవెలదుల్లో అద్భుత శతక పద్యాలు రాసారు. అలాగే సుమతి, బద్దెన, దాశరథి, శేషప్ప కవులు రాసిన పద్యాలు ఈ కాలంలో కూడా ప్రజల నోళ్ళల్లో నీతి శతకాలుగా పలుకుతున్నాయి. అక్షర సత్యాలు, జన చైతన్య నేత్రాలు మూర్తిగారి పద్యాలకు.... ప్రముఖ కవి, విమర్శకులు శ్రీ బిక్కి కృష్ణ చక్కటి ముందుమాట రాసారు ఈ "సుజనులారా" అర్థ శతకానికి. వీటిలో చాలా పద్యాలు గాన యోగ్యంగా అగుపిస్తాయి. పద్మశ్రీ డా॥ కొలకలూరి ఇనాక్ గారు అన్నట్లుగా వామపక్ష దృక్పథం కనిపిస్తుంది చాలా పద్యాల్లో. 'బద్దెన వేమన బాస్కర శతకాముల్/ బహుచక్కగ చదివితి మిక్కిలి మక్కువ/ తొడనీనీకవితా మాలిక లల్లితి గ్రుక్కువ/ మీ అక్కున చేర్చుకొనుట సుజనులారా!' అంటూ తన దృక్పథం చెప్పారు కవి. పి.వి. నరసింహారావు ఆర్థిక సరళీకరణ; విధానాల నిరసనను; స్వచ్ఛ భారత్ వైపు సామాన్యుల్ని నడిపి... ఈ దేశ సంపదను.. భూముల్ని, ఖనిజ సంపదను, గనుల్ని, వ్యాపార సామ్రాజ్యాధినేతలకు కట్టబెట్టే 'మోడీ' మార్క్ మతోన్మాదాన్నీ... సత్యం 'సుజనులారా' అంటూ శతక సాంప్రదాయంలో సాంఘిక అంశాల్ని-రాజకీయాల్ని జొప్పించి, మెప్పించి ఆలోచింపజేశాడు కవి.

- ప్రసన్నకుమారి

హ్యాండ్ మోడల్

ఎంతో మంది మోడళ్లను చూస్తుంటాం. మరి మనం వాడే ప్రతి వస్తువుని మనతో కొనిపించేది వారే కదా (ప్రకటనల ద్వారా)! మోడలింగ్‌ని కెరీర్‌గా ఎంచుకున్న వారు ఎందరో! అయితే చేతులతో మోడలింగ్ చేసే వారూ వుంటారని తెల్సా! వారినే 'హ్యాండ్ మోడల్' అని పిలుస్తారు. మన ముందుకొచ్చిన మోడల్ 'అష్లీ కొవింగ్‌టన్'. ముప్పై ఏడేళ్ల ఈ అమెరికన్ మోడల్ ముందుగా హోటల్లో వెయిట్రెస్‌గా పనిచేసేది. మోడలింగ్ ఆడిషన్‌కి వెళ్లినప్పుడు కెమెరామెన్ ఈమె మొహం మీద కాకుండా చేతుల మీద కేంద్రీకరించి ఫొటోలు తీశాడట. పైగా గోళ్లు కొరకొద్దని, వాటిని చక్కగా పెంచి పోషించమని కూడా సలహా ఇచ్చాడట. ఇక అక్కడి నుంచి ఆమెకు హ్యాండ్ మోడలింగ్ అవకాశాలు కుప్పలు తెప్పలుగా వచ్చి పడ్డాయి. ప్రముఖ సంస్థలన్నిటికీ పని చేస్తుంది. మీ ముందున్న మోడళ్ల మోము, శరీరం మీద కనిపించే సొగసైన చేతులు మాత్రం వాళ్లవి కావు. అష్లీ కొవింగ్‌టన్‌వేనంటే ఆశ్చర్యం వేస్తుంది. అయితే చేతులను జాగ్రత్తగా కాపాడుకునేందుకు ఆమె తీసుకునే శ్రద్ధ అంతా ఇంతా కాదు. కారు డోర్ వేసేప్పుడు, ఇంటి తలుపులు వేసేప్పుడు సైతం ఎంతో జాగ్రత్తగా వుంటుంది. నిత్యం చేతి తొడుగులు వేసుకోవడమే కాక వేళ్లకు మసాజ్ చేయించుకుంటుంది. అంత జాగ్రత్తగా వుండబట్టే హ్యాండ్ మోడల్‌గా మాంచి డిమాండ్ వుందామెకు. ●







నీలి గ్రామం

‘పింక్ సిటీ’ గురించి విన్నాం. చూశాం. ఈ ‘నీలి గ్రామం’ ఏంటి? ఎక్కడుంది? అనుకుంటున్నారా! ఈ గ్రామం పేరు జుజ్‌కార్. స్పెయిన్‌లోని మలగా ప్రావిన్స్‌లో వుంది. అక్కడి ఇళ్లు, తలుపులు, గోడలు...అన్నీ నీలం రంగులోనే వుంటాయి. ఆఖరికి ఊళ్లో వున్న చర్చి కూడా నీలంగానే మెరిసిపోతుంటుంది. ఈ రంగు వెనుక కథ తెలుసుకోవాలంటే నాలుగేళ్లు వెనక్కి పోవాలి. 2011లో ‘స్మర్ఫ్ 3డి’ అనే హాలీవుడ్ సినిమా కోసం ఈ గ్రామానికి నీలం రంగు వేశారు. ఒక్క మూడు మాసాల పాటు నీలం రంగునే వుంచమని కోరారు సినీ నిర్మాతలు. ఆ తర్వాత గ్రామస్తుల ఇష్టమన్నారు. వాళ్లు పెట్టిన గడువు రానూ వచ్చింది. వెళ్లనూ వెళ్లింది. దీనిపై ఓటింగ్ జరిపారు. గ్రామస్తులంతా నీలం రంగుకే మొగ్గు చూపారు. ఆఖరికి చర్చి నిర్వాహకులతో సహా. ఆ తర్వాత కూడా నీలం రంగునే తమ ఇళ్లకు వాడాలనుకున్నారు. అందుకో కారణం లేకపోలేదు. గ్రామం మొత్తం ఒకే రంగులో వుండడం వల్ల ఎక్కడెక్కడి నుంచో వచ్చి చూసిపోయే సందర్శకుల సంఖ్య పెరిగిందట. దీనివల్ల ఊళ్లో వాళ్లకి ఆదాయం పెరిగింది. పర్యాటకం మీదే వారికి మంచి పైకం అందుతుంటే వారు మాత్రం ఎందుకు కాదంటారు. ●